# బలగం TV
BALAGAM

నిజమే మా బలం..ప్రజలే మా బలగం

BALAGAM TV DIGTAL NEWS PAPER/ balagamtv100@gmail.com

హైదరాబాద్ శనివారం, 23 మే-2026 | balagamtv100@gmail.com | పేజీలు-8


## ఎవరెస్ట్ పర్వాతా రోహణలో విషాదం

- కిందకు వస్తున్న క్రమంలో ఇద్దరు భారతీయుల మృతి



## హైదరాబాద్ లో టెస్లా ఇవి కార్ల షోరూం



## మంత్రి శ్రీధర్ బాబుతో కంపెనీ ప్రతినిధుల భేటీ

**హైదరాబాద్,మే22 :** ఇవి వాహనాల దిగ్గజ సంస్థ టెస్లా త్వరలో హైదారాబాద్‌లో విక్రయ, సేవల కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి ముందుకొచ్చింది. శుక్రవారం నాడు ఆ సంస్థ ఇండియా ప్రతినిధులను ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో బేటీ అయిన సందర్భంగా తాము ఇక్కడ అమ్మకాలు ప్రారంభించేందుకు ఆసక్తితో ఉన్నటు వెల్లడించారు. విద్యుత్తు వాహనాలు, ఇంటెలిజెంట్ మొబిలిటీ వ్యవస్థలకు అవసరమైన అత్యాధునిక సాంకేతికతలతో కూడిన ఎకోసిస్టంను తెలంగాణాలో అభివృద్ధి చేసినట్టు ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఈ సందర్భంగా తెలిపారు. సెమీ కండక్టర్ డిజైన్, ఆటోమొబైల్ సాఫ్ట్ వేర్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, డీప్ టెక్నాలజీ రంగాలకు ప్రధాన కేంద్రంగా రాష్ట్రం ఎదిగిందని చెప్పారు. హైదరాబాద్ లో టెస్లా విద్యుత్తు వాహనాల సేల్స్, సర్వీసు సెంటర్లను ఏర్పాటు చేయడానికి ముందుకొచ్చిన టెస్లా ఇండియా జనరల్ మేనేజర్ శరద్ అగర్వాల్, లీడ్ పబ్లిక్ పాలసీ, బిజినెస్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ రజత్ లను శ్రీధర్ బాబు ప్రత్యేకంగా అభినందించారు. టెస్లా ఇప్పటి వరకు దేశంలో నాలుగు సేల్స్ షోరూంలను ఏర్పాటు చేయగా తదుపరి కేంద్రంగా హైదరాబాద్ ను ఎంపిక చేసుకోవడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేసారు. టెస్లా కేవలం ఇవి కార్ల కంపెనీ మాత్రమే కాదని, ఎలక్ట్రిక్ వాహనాల సాఫ్ట్‌వేర్, సెమీకండక్టర్లు, కృత్రిమ మేధస్సు (ఏఐ), రోబోటిక్స్, బ్యాటరీ టెక్నాలజీలు, అధునాతన తయారీ రంగాల్లో నూతన ఆవిష్కరణలను పరిచయం చేసిన సంస్థగా ఎదిగిందని మంత్రి పేర్కొన్నారు. టెస్లా దీర్ఘకాలిక సాంకేతిక లక్ష్యాలకు తెలంగాణలో ఉన్న ఎకోసిస్టం బాగా సరిపోతుందని ఆయన తెలిపారు.

# 3 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం





- తెలంగాణ వృద్ధి రేటు 10.7 శాతం
- దేశ సగటు కంటే వేగంగా వృద్ధి రేటు
- పట్టణీకరణతో సేవల రంగానికి భారీ అవకాశాలు
- విద్యార్థుల రుణాలు భవిష్యత్ పెట్టుబడులు
- రూ.5 లక్షల నుంచి రూ. 10 లక్షలకు వడ్డీ లేని రుణాలు
- బ్యాంకర్ల సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

వివరాలు 4లో..

# భూ దోపిడీ మీద ఉన్న శ్రద్ధ.. రైతన్నలపై ఏదీ

- భూ ఆక్రమణలపై ఎందుకు స్పందించడ లేదు
- సిఎం రేవంత్ తీరుపై మండిపడ్డ కెటిఆర్




**హైదరాబాద్, మే 22:** కాంగ్రెస్ ప్రభుత్వానికి భూముల దోపడీ మీద ఉన్న శ్రద్ధ దేశానికి అన్నంపెట్టే రైతులపై లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశంలో మాట్లాడారు. మొన్నటికి మొన్న రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి భూ హారతి ద్వారా కేసముద్రంలో అసైన్డ్ పట్టాలు ఆక్రమించాడని ఆరోపించారు. శంషాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనుచరులు 90 ఎకరాల సీలింగ్ భూమిని తహసీల్దార్, కలెక్టర్ స్థాయిలో ఉత్తర్వులు ఇచ్చి వేల కోట్ల భూమిని దోపిడీ ఎలా చేశారో ఏసీబీ దాడిలో దొరికారు. అయినా కూడా ఇలాంటి వాటిపై రేవంత్ రెడ్డి దృష్టి పెట్టడని విమర్శించారు. ధాన్యం కొనుగోళ్లు చేపట్టక రైతులు పిట్టల్లా రాలిపోతున్నా ప్రభుత్వానికి పట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం ధాన్యం కొనుగోళ్లపై చేపట్టిన సమీక్ష తీవ్ర నిరాశకు గురి చేసిందన్నారు. డబ్బు సంచుల మీద ఉన్న శ్రద్ధ ధాన్యం సంచుల సేకరణలో లేదని మిగతా 3లో..

## తెలంగాణ విద్యా రంగంలో సంచలనం



- విద్యా కమిషన్ చైర్మన్ పదవికి ఆకునూరి మురళి రాజీనామా
- విద్యారంగంలో అనేక మార్పులు సూచిస్తూ నివేదిక
- అంతలోనే రాజీనామా చేయడంపై సర్వత్రా చర్చ

3లో..

# పదేపదే కొందరికే రిజర్వేషన్లు ఇస్తే ఎలా

- మిగతా వారికి కూడా ఈప్రయోజనం అందవద్దా
- కొందరికే రిజర్వేషన్లు దక్కితే మిగతా ప్రజలు ఏం కాను
- ఇలా అయితే దేశంలో రిజర్వేషన్ల నుంచి బయటపడేనా
- ఐఎఎస్ తల్లిదండ్రుల పిల్లలకు రిజర్వేషన్లు అవసరమా
- సుప్రీం ధర్మాసనం సంచలన వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ, మే 22 :** రిజర్వేషన్లపై సుప్రీం సంచలన వ్యాఖ్యలు చేసింది. కొందరే వీటిని పదేపదే అనుభవించడం ద్వారా మిగతావారికి అడ్డు పడుతున్నారని అభిప్రాయపడింది. గతంలో సిజెఐగా పనిచేసిన బిఆర్ గవాయ్ కూడా ఇలాంటి వ్యాఖ్యలే చేశారు. తాజాగా ఇప్పుడు సుప్రీం ధర్మాసనం కూడా ఇలాంటి వ్యాఖ్యలే చేసింది. వెనుకబడిన తరగతుల్లోని ఆర్థికంగా, విద్యాపరంగా అభివృద్ధి చెందిన కుటుంబాల పిల్లలకు రిజర్వేషన్ ప్రయోజనాలను కొనసాగించాలని కోరడంపై అభ్యంతరం వ్యక్తం చేసింది. ఉన్నత స్థితికి చేరుకున్న కుటుంబాలు పదేపదే రిజర్వేషన్ ప్రయోజనాలు పొందడంపై ఆందోళన వ్యక్తం చేసింది.దేశంలో రిజర్వేషన్ల ఫలాలు అందుకొని సామాజికంగా, ఆర్థికంగా ఉన్నత స్థాయికి చేరిన కుటుంబాలు.. తరతరాలుగా అదే కోటాను కోరుకోవడంపై సుప్రీంకోర్టు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. 'తల్లిదండ్రులు ఇద్దరూ ఐఏఎస్ అధికారులై, ప్రభుత్వ సర్వీసుల్లో ఉంటూ పూర్తి స్థాయిలో స్థిరపడినప్పుడు, ఇక వారి పిల్లలకు రిజర్వేషన్ల కోటా ఎందుకని అత్యున్నత న్యాయస్థానం సంచలన ప్రశ్నలు సంధించింది. వెనుకబడిన వర్గాల్లోని 'క్రీమీలేయర్' పరిమితులు, రిజర్వేషన్ల మినహాయింపులపై దాఖలైన పిటిషన్లను విచారించిన జస్టిస్ బి.వి. నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ధర్మాసనం శుక్రవారం ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. విచారణ సందర్భంగా జస్టిస్ బి.వి. నాగరత్న మాట్లాడుతూ.. విద్య, ఆర్థిక సాధికారత ద్వారా సమాజంలో ఒక స్థాయి లభిస్తుందని పేర్కొన్నారు. 'రిజర్వేషన్ల ద్వారా ఒకసారి ఉన్నత స్థాయికి చేరుకున్నాక కూడా, మళ్లీ వారి పిల్లల కోసం కోటాను ఆశించడం మిగతా 3లో..

# అదనపు ఆదాయ వనరుల పెంపుపై దృష్టి పెట్టండి

- లీకేజీలను అరికట్టి, బడ్జెట్ లక్ష్యాలను అందుకోవాలి
- క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**హైదరాబాద్, మే 22:** రాష్ట్ర ఆర్థిక పురోగతిని పరుగులు పెట్టించేందుకు, ఈ ఆర్థిక సంవత్సరం బ్జడెట్ అవసరాలకు అనుగుణంగా అదనపు ఆదాయ వనరులను సమకూర్చుకోవడంపై అన్ని శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు ఆదేశించారు. శుక్రవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు అధ్యక్షతన 'రిసోర్స్ మొబిలైజేషన్ క్యాబినెట్ సబ్ కమిటీ' ఉన్నత స్థాయి సమావేశం జరిగింది. ఈ కీలక భేటీకి కమిటీ సభ్యులైన నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో అదనపు ఆదాయ మార్గాల అన్వేషణ, వివిధ శాఖల ప్రగతిపై మంత్రుల బృందం అధికారులతో కలిసి లోతుగా సమీక్షించింది. ఈ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ, 2026-27 ఆర్థిక సంవత్సరానికి ప్రతిపాదించనున్న బ్జడెట్ అంచనాలకు మిగతా 3లో..

# నీట్ పేపర్ లీకేజ్‌లో దర్యాప్తు ముమ్మరం




## లాతూర్‌కు చెందిన డాక్టర్ అరెస్ట్

**ముంబయి,మే22 :** లీకైన నీట్ గెస్ పేపర్‌ను కొనుగోలు చేసిన ఒక డాక్టర్‌ను సీబీఐ అదుపులోకి తీసుకున్నది. ఆయన ఆసు పత్రిలో ప్రత్యేక క్లాసులు నిర్వహించి నీట్ గెస్ పేపర్ లీక్ చేయడంపై ప్రశ్నిస్తున్నది. మహారాష్ట్రలోని లాతూర్‌కు చెందిన పీడియాట్రిషియన్ డాక్టర్ మనోజ్ శిరూరేకు ఇప్పటికే అరెస్టయిన ఎన్టీఏ కమిటీలో సభ్యుడైన పూణెళికు చెందిన ప్రొఫెసర్ పీవీ కులకర్ణి, ఆర్‌సీసీ క్లాసెస్ డైరెక్టర్ శివరాజ్ మోటెగావ్‌కర్‌తో పరిచయం ఉన్నది. ఈ నేపథ్యంలో తన మేనల్లుడు, మేనకోడలు కోసం నీట్ గెస్ పేపర్‌ను ఆయన కొనుగోలు చేసినట్లు సీబీఐ దర్యాప్తులో తేలింది. దీంతో గురువారం లాతూర్‌లో డాక్టర్ మనోజ్‌ను సీబీఐ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. పూణెళిలోని తమ కార్యాలయానికి తరలించి ప్రశ్నిస్తున్నారు. ఆ తర్వాత ఢిల్లీకి తీసుకెళ్లి ఆయన అరెస్ట్‌ను ప్రకటించనున్నారు. కాగా, నీట్ పరీక్షకు కొన్ని రోజుల ముందు డాక్టర్ మనోజ్‌కు చెందిన లాతూర్‌లోని ఆసుపత్రిలో పీవీ కులకర్ణి ప్రత్యేక తరగతులు నిర్వహించినట్లు సీబీఐ తెలిపింది. ఆర్‌సీసీ క్లాసెస్ డైరెక్టర్ శివరాజ్ కుమారుడు కూడా ఈ క్లాస్‌లకు మిగతా 3లో..

# నేడు యాదగిరిగుట్టకు సిఎం రేవంత్

## వేద పాఠశాలకు భూమిపూజ




**హైదరాబాద్, మే 22:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం నాడు యాదగిరిగుట్టలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారు. వేద పాఠశాలకు భూమి పూజ, లక్ష్మీనరసింహస్వామి దర్శనం చేసుకోనున్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన షెడ్యూల్ విడుదలైంది. శనివారం ఉదయం 9 గంటలకు హైదరాబాద్ బేగంపేట నుంచి హెలికాప్టర్‌లో యాదగిరిగుట్టకు సీఎం రేవంత్ రెడ్డి బయలుదేరుతారు. అనంతరం 9:15 గంటలకు ప్రతిపాదిత వేద పాఠశాల స్థలానికి చేరుకుంటారు. 9:15 నుంచి 9:45 మధ్య వేద పాఠశాలకు భూమిపూజ, శంకుస్థాపన కార్యక్రమంలో సీఎం రేవంత్ పాల్గొంటారు. సరిగ్గా ఉదయం 9:37 గంటలకు ఎస్ఎల్ఎన్ఎస్‌డీ వేద పాఠశాల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారు. 9:50కు వేద పాఠశాల స్థలం నుంచి లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి బయలుదేరుతారు రేవంత్ రెడ్డి. 10 గంటలకు దేవాలయానికి చేరుకుంటారు. 10 నుంచి 10:30 వరకూ స్వామివారిని దర్శించుకుంటారు. 10:30కు ప్రెసిడెన్షియల్ సూట్‌కు బయలుదేరి 10:40కి అక్కడికి చేరుకుంటారు. దయం 10:40 నుంచి 11 గంటల వరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విశ్రాంతి తీసుకుంటారు. 11 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి 11:10కి హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు. అనంతరం 11:15కు యాదగిరిగుట్ట నుంచి హైదరాబాద్‌కు తిరుగు పయనమవుతారు.

# డిజిటల్ ట్రాన్స్ ఫర్మేషన్‌లో రోల్ మోడల్‌గా తెలంగాణ



- పౌర సేవలు ప్రజలకు మరింత చేరువయ్యేలా 'కాంప్రహెన్సివ్ రోడ్ మ్యాప్'
- ఇన్నోవేషన్స్, టాలెంట్, ఎకనామిక్ గ్రోత్ ను అనుసంధానించేలా 'ఎకో సిస్టం'
- 'డిజిటల్ ట్రాన్స్ ఫర్మేషన్ ఫైనాన్స్ సమ్మిట్ 2026'లో మంత్రి శ్రీధర్ బాబు

**హైదరాబాద్, మే 22:** డిజిటల్ ట్రాన్స్ ఫర్మేషన్ లో తెలంగాణను దేశంలోని ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్ గా తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ఇందులో భాగంగా... ప్రభుత్వ పౌర సేవల్ని మరింత సమర్థవంతంగా, పారదర్శకంగా ప్రజల ముంగిటకే చేర్చేలా ఒక ప్రత్యేక కాంప్రహెన్సివ్ రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేస్తున్నామన్నారు. దిఇన్సిట్యూట్ ఆఫ్ ఛార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) ఆధ్వర్యంలో శుక్రవారం నోవాటెల్ హెచ్ఐసీసీలో నిర్వహించిన 'డిజి టల్ ట్రాన్స్ ఫర్మేషన్ ÷నాన్స్ సమ్మిట్ 2026'కు ఆయన మిగతా 3లో..

బలగం TV BALAGAM

balagamtv100@gmail.com

# వివాదంగా త్రిభాషా విధానం

- మూడు భాషలు తప్పనిసరి చేయడంపై సవాల్
- సుప్రీంలో ప్రజాప్రయోజన వాజ్యం దాఖలు



న్యూఢిల్లీ,మే22 : సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ తొమ్మిదో తరగతి విద్యార్థులకు మూడు భాషల బోధనను తప్పనిసరి చేస్తూ తీసుకువచ్చిన నూతన విద్యా విధానం ఇప్పుడు న్యాయ వివాదానికి దారితీసింది. బోర్డు తీసుకున్న ఈ నిర్ణయాన్ని సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో ఒక ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లి దండ్రుల తరపున దాఖలైన ఈ పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం విచారణకు స్వీకరించింది. ఈ వ్యవ హారాన్ని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ముందు సీని యర్ న్యాయవాది ముకుల్ రోహత్గి ప్రస్తావించారు. విద్యా సంవత్సరం మధ్యలో అకస్మాత్తుగా తొమ్మిదో తరగతి నుంచి మూడు భాషలను తప్పనిసరి చేయడం వల్ల విద్యార్థులపై తీవ్రమైన మానసిక, విద్యాపరమైన భారం పడుతుందని రోహత్గి కోర్టుకు తెలియజేశారు. ప్రస్తుతం అమల్లో ఉన్న విద్యా విధానానికి ఇది పూర్తిగా భిన్నంగా ఉందని, దీనివల్ల అటు విద్యార్థుల్లో, ఇటు విద్యాసంస్థల్లో తీవ్ర గందరగోళం నెలకొందని ఆయన పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై త్వరితగతిన విచారణ జరపాలని ఆయన ధర్మాసనాన్ని అభ్యర్థించారు. జాతీయ విద్యా విధానం (జెఇఇ) సిఫార్సుల మేరకు సీబీఎస్ఈ ఈ విద్యా చట్టంలో మార్పులు చేస్తూ,9, 10 తరగతుల్లో విద్యార్థులు కచ్చితంగా మూడు భాషలను అందులో రెండు భారతీయ భాషలను చదవాలనే నిబంధనను తీసుకు వచ్చింది. అయితే, తగిన ముందస్తు ప్రణాళిక లేకుండా, కోర్సు మధ్యలో ఈ నిబంధనను రుద్దడం సమంజసం కాదని పిటిషనర్లు వాదిస్తున్నారు. ఈ వాదనలను పరిశీలించిన సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం, ఈ పిటిషన్‌పై వచ్చే వారం సమగ్ర విచారణ జరిపేందుకు అంగీకారం తెలిపింది. ఈ విచారణపై దేశవ్యాప్తంగా ఉన్న సీబీఎస్ఈ పాఠశాలలు, విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఉత్కంఠ నెలకొంది.

# గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఊతమివ్వాలి

- వ్యవసాయాధార పరిశ్రమలకు రుణాలు పెంచాలి
- సంప్రదాయ వ్యవసాయ రునాలకే పరిమితం కారాదు
- బ్యాంకర్ల సమావేశంలో మంత్రి తుమ్మల సూచన




హైదరాబాద్, మే 22: తెలంగాణ రాష్ట్ర గ్రామీణ ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేయడంలో బ్యాంకులు చురుకైన భాగస్వాములు కావాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ప్రజా భవన్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశంలో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. బ్యాంకర్లు కేవలం సాంప్రదాయ పంట రుణాలకే పరిమితం కాకుండా, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు ఫుడ్ ప్రాసెసింగ్ రంగానికి రుణాల పంపిణీని భారీగా పెంచాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. గ్రామీణ తెలంగాణలో పెట్టుబడులు పెట్టడానికి ఇదే సరైన సమయమని, ఈ అవకాశాన్ని బ్యాంకులు ఉపయోగించుకోవాలని ఆయన ఆకాంక్షించారు. తెలంగాణలో క్రెడిట్-డిపాజిట్ నిష్పత్తి రికార్డు స్థాయిలో 130.78 శాతం నమోదు కావడం గొప్ప విశేషం అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో బ్యాంక్ డిపాజిట్లు రూ.9.43 లక్షల కోట్లుగా ఉంటే, అడ్వాన్సులు (రుణాలు) రూ.12.33 లక్షల కోట్లకు చేరాయి. వ్యవసాయ రంగానికి రుణాల పంపిణీలో రాష్ట్రం అద్భుతమైన ప్రగతిని సాధించింది. నిర్ణీత లక్ష్యం కంటే ఎక్కువగా 102 శాతం ప్రగతిని నమోదు చేయడం హర్షణీయం. రాష్ట్రంలో పంట రుణాల పంపిణీ రూ.75,486 కోట్లకు చేరిందని, వ్యవసాయ రంగానికి మొత్తంగా రూ.1.68 లక్షల కోట్ల రుణాలను బ్యాంకులు అందజేశాయి. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతు రుణమాఫీ కార్యక్రమం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో రుణ సంస్కృతి తిరిగి పునరుద్ధరించబడింది. ప్రభుత్వ నిర్ణయాల వల్ల బ్యాంకులలో వ్యవసాయ నిరర్థక ఆస్తులు 5.23 శాతం నుంచి 4.71 శాతానికి తగ్గాయి. తెలంగాణలో ఉద్యానవన రంగంతో పాటు ఆయిల్ పామ్ సాగుకు అపారమైన అవకాశాలు ఉన్నాయని మంత్రి అన్నారు. ఈ రంగాలకు బ్యాంకులు పెద్దపీట వేయాలి. పంట నిల్వ సామర్థ్యాన్ని పెంచేందుకు వీలుగా గిడ్డంగులు, కోల్డ్ స్టోరేజీలు, సైలోల నిర్మాణానికి బ్యాంకులు ఉదారంగా రుణాలు ఇవ్వాలి. అలాగే రాష్ట్రంలో ఉన్న దాదాపు వెయ్యి రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు తగిన ఆర్థిక మద్దతు అందించాల్సిన బాధ్యత బ్యాంకర్లపై ఉంది. వ్యవసాయాన్ని ఆధునికీకరించేందుకు, యాంత్రీకరణను ప్రోత్సహించేందుకు గానూ ప్రభుత్వం రూ.147.91 కోట్ల బ్జడెట్‌ను కేటాయించింది. కౌలు రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సకాలంలో పంట రుణాలు అందేలా బ్యాంకులు బాధ్యత తీసుకోవాలి. వీటితో పాటూ పర్యావరణ హితమైన సోలార్ వ్యవసాయం, మైక్రో ఇరిగేషన్ పద్ధతులకు రుణ సదుపాయాన్ని గణనీయంగా పెంచాలని మంత్రి తెలిపారు.

# మలేషియాలో 6న తెలంగాణ ఆవిర్భావ వేడుకలు



- ముఖ్య అతిథిగా హాజరు కానున్న కెటిఆర్
- బ్రోచర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి



హైదరాబాద్,మే22 : మలేషియా తెలంగాణ అసోసియేషన్, బీఆర్ఎస్ మలేషియా సంయుక్త ఆధ్వర్యంలో జూన్ 6 న కౌలాలంపూర్‌లో జరిగే తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే టీ రామారావు పాల్గొంటున్నారు. ఈ కార్యక్రమ బ్రోచర్‌ను మాజీ మంత్రి ,ఎమ్మెల్యే జి .జగదీశ్ రెడ్డి శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంతో పాటు ప్రపంచ వ్యాప్తంగా కేసీఆర్ పేరును గుర్తు చేసుకుంటున్నారని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ లేని లోటు రెండున్నర ఏండ్లుగా కనిపిస్తుందని వెల్లడించారు.కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయలేక పోతుందని, కేసీఆర్ ఇచ్చిన పథకాలనూ ఇవ్వలేక పోతుందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీని నమ్మి మోసపోయామని తెలంగాణ ప్రజలు భావిస్తున్నారని తెలిపారు. అమెరికా దేశ చరిత్రలోనే కనివిని ఎరుగని రీతిలో గతంలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు డల్లాస్‌లో జరిగాయని వివరించారు. దేశంలో బీజేపీ పాలనలో చిన్న పిల్లలకు రక్షణ లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. చిన్న పిల్లలపై అఘాయిత్యాలు చేస్తున్న నిందితులను పట్టుకునే శక్తి కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదని ఆరోపించారు. ఖరీఫ్ సీజన్ త్వరంలో ప్రారంభమవుతుందని, రైతులకు విత్తనాలు ,ఎరువులు ఇచ్చే పరిస్థితిలో ప్రభుత్వం లేదని అన్నారు. రేవంత్ రెడ్డి పాత గురువు, చీకటి గురువు చెప్పినట్లు రైతులను వ్యవసాయానికి దూరం చేస్తున్నారని మండిపడ్డారు .రైతాంగాన్ని ముంచి వ్యవసాయ సబ్సిడీలు దోచుకోవాలనే ఆలోచన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలదని అన్నారు.ప్రపంచ వ్యాప్తంగా ఏం జరిగిన ట్వీట్ చేసే రాహుల్ గాంధీ తెలంగాణలో మైనర్ బాలిక ఘటన పై ఎందుకు ట్వీట్ చేయ లేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పార్టీనే తెలంగాణ ప్రజలకు , మహిళలకు శ్రీరామ రక్ష అని అన్నారు .ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి గ్యాదరి బాలమల్లు, బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ సెల్ ప్రెసిడెంట్ మహేష్ బిగాల, మైటా ప్రెసిడెంట్ తిరుపతి,ఉమెన్స్ వింగ్ సుప్రియ, బీఆర్ఎస్ మలేసియా ప్రెసిడెంట్ చిట్టీ బాబు, శివ, రాష్ట్ర నాయకులు నరసింహ రెడ్డి, నంద్యాల దయాకర్ రెడ్డి, ధర్మేందర్ రెడ్డి, పడాల సతీష్, రవి యాదవ్ పాల్గొన్నారు.

# ఫ్యూచర్ సిటీ పేరుతో రియల్ వ్యాపారం

- బిఆర్ఎస్ రాగానే ఫ్యూచర్ సిటీ రద్దు చేస్తాం
- మాజీమంత్రి హరీష్ రావు హెచ్చరిక



హైదరాబాద్, మే 22: బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. అమెరికా పర్యటనలో ఉన్న మాజీ మంత్రి.. కాంగ్రెస్ సర్కార్ చేపడుతున్న ఫ్యూచర్ సిటీ ప్రాజెక్ట్‌పై కీలక వ్యాఖ్యలు చేశారు. ఫార్మా సిటీకి మాత్రమే కేంద్ర పర్యావరణశాఖ అనుమతి ఇచ్చిందని తెలిపారు. డీవియేషన్ ఉంటే రైతుల భూములు వెనక్కి ఇవ్వాలని చట్టంలో ఉందని వెల్లడించారు. ఫార్మా సిటీని కొనసాగిస్తామని ఓ వైపు కోర్టుకు చెబుతూ.. రేవంత్ ప్రభుత్వం జిమ్మిక్కు చేస్తోందని విమర్శించారు. ఫార్మా సిటీ వస్తే దానికి అను బంధంగా కనీస సౌకర్యాలు ఎడ్యుకేషన్, హౌసింగ్ రావాలని ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. 75శాతం ఫార్మా సిటీ ఉండి... మిగతా 25శాతం మిగతావి ఉండాలని అన్నారు. కానీ..75శాతం మిగతా వ్యాపారం చేసి.. కేవలం 25శాతమే ఫార్మా వచ్చేలా చేస్తున్నారని విమర్శించారు. ఇది చట్ట ప్రకారం చెల్లదన్నారు. ఫ్యూచర్ సిటీ పేరుతో కాంగ్రెస్ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తోందని మాజీ మంత్రి ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామని.. ఫార్మా సిటీని రీస్టోర్ చేస్తామని స్పష్టం చేశారు. 'ఇది నా మాట కాదు.. పార్లమెంట్ చట్టం. ఫార్మా సిటీ వస్తే లక్షలాది మందికి ఉద్యోగాలు వస్తా యని మేము ప్రారంభించాం. మన దగ్గర నుంచి ఒక్క ఫార్మా కంపెనీ బయటికి వెళ్లొద్దని చేశాం. ఇప్పటికే రెండున్నరేళ్లు గడిచిపోయింది. లాస్ట్ వన్ ఇయర్ ఎలక్షన్ ఉంటుంది. రేవంత్ సర్కార్ ఏమీ చేయలేదు. భూములు పంచి పెడితే బ్యాక్ ఎండ్ ఏదో లబ్ధి పొందాలని ఎలాన్ చేశారు. ఫార్మా సిటీ అభివృద్ధి చెందితే బీఆర్ఎస్‌కు పేరు వస్తుందని ఇలా చేశారు. ఉన్నది ఉన్నట్టుగా అక్కడ ఫార్మా సిటీనే వస్తుంది' అని హరీశ్ రావు స్పష్టం చేశారు.

# ధాన్యం అన్‌లోడింగా వెంటనే చేయాలి

## బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ ఆదేశం

ఆదిలాబాద్,మే22 : వరి ధాన్యం అన్ లోడింగ్ పక్రియను వేగవంతం చేయాలని బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ ఆదేశించారు. శుక్రవారం తాండూర్ మండల కేంద్రంలోని కార్తికేయ రైస్ మిల్లును తాండూర్ తహసీల్దార్ జ్యోత్స్న తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం వరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి కనీస మద్దతు ధర చెల్లించి రైతుల వద్ద నుంచి నిబంధనల ప్రకారం నాణ్యమైన వరి ధాన్యం కొనుగోలు చేస్తుందని తెలిపారు. వరి కొనుగోలు కేంద్రాల నుంచి కొనుగోలు చేసిన వరి ధాన్యాన్ని కేటాయించిన ప్రకారంగా రైస్ మిల్లులకు, గోదాములకు తరలించాలని అధికారులను కోరారు. గోదాములకు తరలించిన వరి ధాన్యాన్ని నిబంధనల ప్రకారం నిలువ చేయాలని, తదుపరి ఆదేశాలు ప్రకారం తరలించే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. సబ్ కలెక్టర్ వెంట ఆర్ఐ బొలిశెట్టి పద్మజా, రెవిన్యూ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

# కిడ్నీ మార్పిడి చికిత్సల్లో నిమ్స్ ఘనత

## వైద్య బృందాన్ని అభినందించిన సిఎం రేవంత్

హైదరాబాద్, మే 22: కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్స్‌లో అరుదైన మైలురాయిని అందుకున్న నిమ్స్ వైద్య బృందానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందనలు తెలియజేశారు. హైదరాబాద్‌లోని నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ కిడ్నీ మార్పిడి చికిత్సలో దేశంలోనే అరుదైన రికార్డు నమోదు చేసింది. నిమ్స్ యూరాలజీ విభాగం ఇప్పటివరకు 2,000 కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్స్ పూర్తి చేసింది. కిడ్నీ మార్పిడిలో దక్షిణ భారత దేశంలో నిమ్స్ నంబర్ వన్‌గా నిలిచింది. దేశంలో కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్స్‌లో గుజరాత్‌లోని ఐకేడీఆర్‌సీ మొదటి స్థానంలో ఉంది. రెండో స్థానంలో లూథియానా క్రిస్టియన్ కాలేజీలో ఉండగా.. నిమ్స్ మూడో స్థానంలో నిలిచింది. ఈ అరుదైన మైలురాయిని సాధించి కిడ్నీ బాధితులకు విశేష సేవలు అందించిన నిమ్స్ వైద్య బృం దానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. ఈ 2,000 మందిలో 1,900 మంది అంటే 95? మంది రాజీవ్ ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఉచితంగా కిడ్నీ మార్పిడి చేయించుకోవటం విశేషం. 2023 జనవరి నుంచి గడిచిన మూడేళ్ల నాలుగు నెలల్లోనే.. 500 కిడ్నీ మార్పిడిలు చేసి నిమ్స్ రికార్డు నెలకొల్పింది.

# పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితుల కారణం

- ఆయిల్ మార్కెట్‌లో ప్రమాదకరమైన 'రెడ్ జోన్'

న్యూఢిల్లీ,మే22 : పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల కారణంగా ప్రపంచ ఆయిల్ మార్కెట్ త్వరలో తీవ్ర ప్రమాదకరమైన 'రెడ్ జోన్'లోకి ప్రవేశిస్తుందని ఇంటర్‌నేషనల్ ఎనర్జీ ఏజెన్సీ చీఫ్ ఫాతిహ్ బిరోల్ హెచ్చరించారు. హోర్ముజ్ జలసంధి మూసివేత భయాలు, వేసవి కాలంలో పెరగనున్న డిమాండ్ కారణంగా క్రూడ్ ఆయిల్ సప్లై స్తంభించి.. ధరలు భారీగా పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ ఆయిల్ సంక్షోభం ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉందని అన్నారు. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల కారణంగా ప్రపంచ వ్యాప్తంగా ఆయిల్, గ్యాస్ కొరత ఏర్పడ్డ సంగతి తెలిసిందే. రోజు రోజుకు సమస్య తీవ్రతరం అవుతోంది. యుద్ధం కారణంగా పశ్చిమాసియాలో ఆయిల్, గ్యాస్ ఉత్పత్తికి ఆటంకం ఏర్పడింది. అంతేకాదు.. ప్రపంచ వ్యాప్తంగా 20 శాతం నౌకలు ఆయిల్, గ్యాస్ రవాణా చేసే హోర్ముజ్ జలసంధి కూడా మూతపడింది. అమెరికా-ఇరాన్ యుద్ధం, హోర్ముజ్ జలసంధి మూత పడటం కారణంగా ప్రపంచ మార్కెట్‌లో ప్రతీరోజూ 13 నుంచి 14 మిలియన్ బ్యారెళ్ల క్రూడ్ ఆయిల్ సప్లై నిలిచిపోయిందని ఇంటర్ నేషనల్ ఎనర్జీ ఏజెన్సీ చీఫ్ ఫాతిహ్ బిరోల్ తెలిపారు.హోర్ముజ్‌ను మళ్లీ తెరవక పోవటం..నౌకలు ప్రయాణించడానికి ప్రత్యామ్నాయ దారులు లేకపోవటంతో సప్లై మరింత దారుణంగా పడిపోయిందని బిరోల్ అన్నారు. సప్లై నిలిచిపోవటం కారణంగా ప్రపంచవ్యాప్తంగా ఆయిల్ నిల్వలు వేగంగా కరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మార్చి నెలలో ఐఈఏ, 32 సభ్య దేశాలు కలిసి మార్కెట్లోకి విడుదల చేసిన రికార్డు స్థాయి 400 మిలియన్ బ్యారెళ్ల అత్యవసర చమురు నిల్వలు కూడా పూర్తిగాహరించుకుపోయాయని ఆయన పేర్కొన్నారు.

# అభినయ దర్శన వ్యవహారంపై విచారణ

- త్వరలోనే అసలు రంగు బయటపడతుంది
- హోం మంత్రి అనిత వెల్లడి




విశాఖపట్నం,మే22 : క్రైస్తవ మత ప్రచారకుడు, నటుడు అభినయ్ దర్శన్ వ్యవహారంపై హోం మంత్రి అనిత స్పందించారు. అభినయ్ దర్శన్ వ్యవహారంలో విచారణ జరుగుతోందని.. ఈ వ్యవహారంలో రాజకీయ కోణంపైనా పోలీసులు విచారణ చేస్తున్నట్లు తెలిపారు. కుట్రకోణం లేకపోతే కడప నుంచి అల్లూరి జిల్లాకు రావాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. అమాయకపు గిరిజనులను అభినయ్ దర్శన్ నమ్మించి పాస్టర్ అవతారం ఎత్తారని.. ఆయనపై దాడి జరగక పోయినా జరిగిందని నమ్మించారన్నారు. అభినయ్ దర్శన్ వ్యవహారంలో ఎవరు ఉన్నారనేది త్వరలో బయటపడుతుందని తెలిపారు.దర్శన్‌పై క్రిమినల్ కేసులు ఉన్నాయని.. వర్గాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా ప్రయత్నం చేశారని హోంమంత్రి వెల్లడించారు. ప్రభుత్వాన్ని బదనాం చేసే దృక్పథం ఏమైనా ఉందా అనే కోణంలో విచారణ జరుగుతోందని చెప్పారు. కూటమి ప్రభుత్వ హయాంలో ఇటువంటి నాటకాలు చెల్లవని.. ఇలాంటి ఆలోచనలు ఇంకెవరికైనా ఉంటే మానుకోవాలని హితవు పలికారు. ఎవరైనా ఇటువంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అభినయ్ దర్శన్‌ను కస్టడీలోకి తీసుకొని విచారణ చేస్తామని హోం మంత్రి అనిత పేర్కొన్నారు.

# కేంద్రానికి ఆర్‌బిఐ శుభవార్త

## రూ.2.87 లక్షల కోట్లు డివిడెండ్ ప్రకటన

ముంబయి,మే22 : కేంద్ర ప్రభుత్వానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గుడ్‌న్యూస్ చెప్పింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.2.87 లక్షల కోట్లు డివిడెండ్ రూపంలో చెల్లించనున్నట్లు శుక్రవారం ప్రకటించింది. ఆర్‌బీఐ ఏటా మిగులు నిధులను కేంద్ర ప్రభుత్వానికి డివిడెండ్ రూపంలో చెల్లిస్తుంది. ప్రస్తుత భౌగోళిక రాజకీయ అనిశ్చిత పరిస్థితుల్లో ప్రభుత్వానికి ఈ మొత్తం ఊరట కల్పించే అంశం. ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా నేతృత్వంలో ఆర్‌బీఐ సెంట్రల్ బోర్డు డైరెక్టర్లు నిర్వహించిన 623వ సమావేశంలో డివిడెండ్ చెల్లింపులపై నిర్ణయం తీసుకున్నారు. ఈ స్థాయిలో డివిడెండ్ చెల్లించడం ఇదే తొలిసారి. దేశీయ, అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితులు, భయాందోళనల ముప్పును సమీక్షించిన అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆర్‌బీఐ ఓ ప్రకటనలో పేర్కొంది. దేశ, విదేశీ సెక్యూరిటీలపై వడ్డీ, సేవలపై రుసుములు, కమీషన్లు, విదేశీ మారకపు ద్రవ్యం లావాదేవీలపై లాభం, అనుబంధ సంస్థల నుంచి ప్రతిఫలం రూపేణ ఆర్‌బీఐకు ఆదాయం లభిస్తుంది. కరెన్సీ నోట్ల ముద్రణ, డిపాజిట్లు-రుణాలపై వడ్డీల చెల్లింపులు, సిబ్బంది జీతభత్యాలు-పింఛన్లు, కార్యాలయాల నిర్వహణ ఖర్చులు, ఆకస్మిక పరిస్థితులు- తరుగుదలకు కేటాయింపులు వంటి వ్యయాలు ఉంటాయి. ఈ ఆదాయ, వ్యయాల మధ్య తేడానే మిగులు నిధులుగా వ్యవహరిస్తారు.ఈమిగులునిధులనుకేంద్రానికి ఏటా బదిలీ చేస్తుంది. ఆర్‌బీఐ, ప్రభుత్వ రంగ బ్యాంకుల డివిడెండ్ల రూపంలో ఖజానాకు రూ.3.16 లక్షలకోట్లుసమకూరుతాయని బడ్జెట్‌లో ప్రభుత్వం అంచనా వేసింది.

# ప్లాస్టిక్ రహితమైదానాలుగా తీర్చిదిద్దాలి

హైదరాబాద్,మే22 : రాష్ట్రంలో అన్ని క్రీడా మైదానాలను ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దేందుకు తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ కృషి చేస్తుందని స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న 'స్పోర్ట్స్ అండ్ యూత్ వారోత్సవాలు' కార్యక్రమాల్లో రాష్ట్రవ్యాప్తంగా ' సర్వ్ అండ్ సపోర్ట్- యూత్ ఫర్ క్లీన్ తెలంగాణ కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రంలోని అన్నిజిల్లా ల్లో యువజన క్రీడాశాఖ ఆధ్వర్యంలో అన్ని స్టేడియాల్లో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాలు విజయవంతంగా జరిగాయి. రాష్ట్ర స్థాయి ప్రధాన ఉత్సవాలు హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించబడగా, యువత, క్రీడాకారులు, తల్లిదండ్రులు ఈ కార్యక్రమంలో పాలుపంచుకున్నారు. తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో జంట నగరాల్లోని జీఎంసీబీ స్టేడియం, కేవీబీఆర్ ఇండోర్ స్టేడియం, సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం, జింఖానా గ్రౌండ్స్, సైక్లింగ్ వెలోడ్రోమ్ స్టేడియంలో ఈ కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. ఎల్బీ స్టేడియంలో జరిగిన కార్యక్రమానికి స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి ఎండి డాక్టర్ సోనీ బాలాదేవిలు హాజరైనారు. ఈ సందర్భంగా చైర్మన్ శివసేన రెడ్డి మాట్లాడుతూ, క్రీడాకారులు వారి తల్లిదండ్రులు కోచులు సిబ్బంది మైదానాలను ప్లే ఫీల్డ్ లను పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని అన్ని స్టేడియాలను ఎలాస్టిక్ రహిత మైదానాలుగా తీర్చిదిద్దాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తూ ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక లో భాగంగా యువజన క్రీడ వారోత్సవాలు నిర్వహిస్తూ, ప్రజల అభిప్రాయాన్ని క్రోడీకరించి క్రీడలు మరియు యువజన అభివృద్ధికి ప్రణాళిక బద్ధమైన కృషి చేస్తుందని ఆయన అన్నారు.

# తెలంగాణ విద్యా రంగంలో సంచలనం

హైదరాబాద్, మే 22: తెలంగాణ విద్యా రంగంలో సంచలనం చోటుచేసుకుంది. రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్, మాజీ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి తన పదవికి రాజీనామా చేశారు. విద్యావ్యవస్థలో సమూల మార్పులు తీసుకురావాలనే లక్ష్యంతో రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆయనను ఈ కీలక బాధ్యతల్లో నియమించింది. అయితే, తన పదవికి నాలుగు నెలల ముందుగానే రాజీనామా లేఖను ప్రభుత్వానికి సమర్పించడం రాష్ట్ర రాజకీయ, విద్యా వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. తెలంగాణ విద్యా రంగంపై సమగ్ర నివేదికను ప్రభుత్వానికి సమర్పించిన అనంతరం ఆకునూరి మురళి ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. విద్యా సంస్కరణల నివేదిక పూర్తి కావడంతో తన బాధ్యత ముగిసిందని పేర్కొంటూ, తన రాజీనామా లేఖను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి సమర్పించారు. విద్యా సంస్కరణల కోసం ఏర్పాటు చేసిన తొలి విద్యా కమిషన్ చైర్మనే ఇలా అర్ధాంతరంగా తప్పుకోవడంతో, రాబోయే రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వ విద్యా విధానాలు, నూతన విద్యా చట్టాల రూపకల్పన ఏ మలుపు తిరుగుతుందనేది ఆసక్తికరంగా మారింది.ఇంకా నాలుగు నెలల పదవీ కాలం మిగిలి ఉండగానే ఆయన ఈ పదవి నుంచి తప్పుకోవడం గమనార్హం. ఈ సందర్భంగా తనకు అవకాశం కల్పించిన తెలంగాణ ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలుపుతూ.. తన రాజీనామా విషయమై సీఎం కార్యదర్శికి కూడా ముందస్తు సమాచారం పంపారు. ఆకునూరి మురళి నేతృత్వంలోని విద్యా కమిషన్ ఇటీవల ప్రభుత్వానికి సమర్పించిన కొన్ని సిఫార్సులు తీవ్ర వివాదానికి దారితీశాయి. ముఖ్యంగా రాష్ట్రంలో ఉపాధ్యాయులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది వేతనాలు మార్కెట్ ప్రమాణాల కంటే చాలా ఎక్కువగా ఉన్నాయని, వాటిని సమీక్షించి 'హేతుబద్ధీకరించాలని' కమిషన్ చేసిన వ్యాఖ్యలపై ఉపాధ్యాయ సంఘాలు భగ్గుమన్నాయి. దీనికి తోడు ఇంటర్మీడియట్ బోర్డును రద్దు చేసి, ఇంటర్ విద్యను కూడా పాఠశాల విద్యలోనే విలీనం చేయాలనే ఆలోచ నలపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ఈ సిఫార్సులపై ప్రతిపక్షాలైన బీఆర్ఎస్, బీజేపీలతో పాటు ఉపాధ్యాయ సంఘాలు రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసనలు చేపట్టాయి. ఏసీ రూమ్‌లలో కూర్చుని క్షేత్రస్థాయి పరిస్థితులు తెలియకుండా ఇలాంటి నివేదికలు ఇచ్చారంటూ ప్రతిపక్ష నేతలు కమిషన్‌పై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రభుత్వ బడులను కార్పొరేట్ స్థాయికి ధీటుగా మార్చాలనే పట్టుదలతో ఉండే ఆకునూరి మురళి.. గతంలో ఏపీ విద్యాశాఖలోనూ కీలక బాధ్యతలు నిర్వహించారు.

# ఎవరెస్ట్ పర్వాతారోహణలో విషాదం

## కిందకు వస్తున్న క్రమంలో ఇద్దరు భారతీయుల మృతి

న్యూఢిల్లీ,మే22 : ఎవరెస్ట్ పర్వత శిఖరంపై విషాదం చోటు సేసుకుంది. పర్వతారోహణ ముగించుకుని కిందకు దిగివస్తుండగా ఇద్దరు భారతీయులు ప్రాణాలు కోల్పోయినట్టు నేపాల్ అధికారులు ప్రకటించారు. మృతులను అరుణ్‌కుమార్ తివారీ, సందీప్ అరేగా గుర్తించారు. ఎవరెస్ట్ శిఖరం దిగుతుండగా సందీప్ అరే తీవ్రంగా అలసిపోయారని, ఆయనను కాపాడేందుకు గైడ్స్ ప్రయత్నిం చినప్పటికీ ప్రాణాలను కాపాడలేకపోయారని ఎక్స్‌పెడిషన్ ఆపరేటర్స్ అసోసియేషన్ ఆఫ్ నేపాల్ సెక్రటరీ జనరల్ రిషి భండారి తెలిపారు. గురువారం సాయంత్రం 5.30 గంటల సమయంలోనే మరో పర్వతారోకుడు అరుణ్ తివారీ కూడా ఎవరెస్ట్ నుంచి కిందకు దిగుతూ హిల్లరీ స్టెప్ వద్ద తీవ్రంగా అలసిపోవడంతో నలుగురు గైడ్స్ ఆయనకు సాయం చేసినప్పటికీ ఫలితం లేకపోయిందని చెప్పారు. క్యాంప్-2 వద్ద ఆయన కన్నుమూసినట్టు వివరించారు. ఎవరెస్ట్ శిఖరాన్ని గత బుధవారం విజయవంతంగా 274 మంది అధిరోహించారు.

## (మొదటిపేజీ తరువాయి)

## భూ దోపిడీ మీద ఉన్న శ్రద్ధ.. రైతన్నలపై ఏదీ

మండిపడ్డారు. తెలంగాణ వ్యాప్తంగా వడ్లు కొనక 45 రోజుల్లో 10 మంది చనిపోతే ఒక్కరు కూడా చనిపోలేదని సివిల్ సప్లైస్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సిగ్గు లేకుండా అబద్దాలు ఆడుతున్నారు. మంత్రి సొంత జిల్లాలో మహ్మద్ నసీరుద్దీన్ అనే రైతుల ధాన్యం రాశిపైనే మృతి చెందాడన్నారు. జనగామ జిల్లా ఏనెబావిలో కాంటాలు పెట్టడంలేదని కాంగ్రెస్ కార్యకర్తలే ఆందోళన చేరన్నారు. ఇనేక సంఘటనలు జరిగాయన్నారు. ఓ కాంగ్రెస్ నాయకుడు మా పార్టీ నాయకుడికి ఫోన్ చేసి, ధాన్యం ప్రభుత్వం కొనుడు ఎందయ్యా, మాకు లేని పని పెట్టిండు మీ కేసీఆర్ అని చెప్తున్నాడు ఓ కాంగ్రెస్ నాయకుడు మా పార్టీ నాయకుడికి ఫోన్ చేసి ధాన్యం ప్రభుత్వం కొనుడు ఎందయ్యా, మాకు లేని పని పెట్టిండు మీ కేసీఆర్ అని చెప్తున్నాడు. రాష్ట్రంలో ఇప్పటివరకు 35? ధాన్యం కూడా కొనుగోలు చేయలేదన్నారు. కానీ రేవంత్ రెడ్డి, అతని మంత్రులు 80? కొనుగోలు చేశామని అబద్దాలు చెప్తున్నారని మండిపడ్డారు. రైతుల ఇబ్బందుల మీద అవగాహన లేకుండా రేవంత్ రెడ్డి అడ్డగోలుగా మాట్లాడుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏ ఊరికైనా పోదాం.. ఎక్కడన్నా మీరు చెప్పినట్లు 80 శాతం పంట కొనుగోళ్లు చేశారని నిరూపిస్తే మేము ఏ శిక్షకైనా సిద్ధమని రేవంత్ రెడ్డికి కేటీఆర్ ఛాలెంజ్ విసిరారు. రేవంత్‌లో అగౌరవంగా మాట్లాడే భాష తనకు రాదన్నారు.

## పదేపదే కొందరికే రిజర్వేషన్లు ఇస్తే ఎలా

సరికాదు. ఇలాగైతే మనం రిజర్వేషన్ల వ్యవస్థ నుంచి ఎప్పటికీ బయటపడలేం. ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించాల్సి ఉందని వ్యాఖ్యానించారు. ఒక వ్యక్తి సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడి ఉండవచ్చని.. కానీ, రిజర్వేషన్ల ప్రయోజనం పొంది తల్లిదండ్రులు ఉన్నత స్థానాలకు వెళ్లినప్పుడు వారి పిల్లల పరిస్థితి మారుతుందని, ఇక్కడ ఒక సమతుల్యత అవసరమని కోర్టు స్పష్టం చేసింది. ఒకే కుటుంబంలో ఉన్నత వర్గాలే అన్ని అవకాశాలను చేజిక్కించు కుంటే, అదే వర్గంలోని అత్యంత వెనుకబడిన పేదలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ధర్మాసనం ఆందోళన వ్యక్తం చేసింది. రిజర్వేషన్ల ఫలాలు కేవలం కొందరికే పరిమితం కాకుండా, సమాజంలో కిందిస్థాయిలో ఉన్న చివరి వ్యక్తికి కూడా అందాల్సిన అవసరం ఉందని కోర్టు అభిప్రాయపడింది. ప్రస్తుతం ఓబీసీలకే పరిమితమైన 'క్రీమీ లేయర్' నిబంధనలను, మరింత శాస్త్రీయంగా అమలు చేయడంపై న్యాయస్థానం దృష్టి సారించింది. 1992 నాటి చారిత్రాత్మక 'ఇంద్ర సాహ్ని' కేసులో సుప్రీంకోర్టు ఓబీసీలకు 27 శాతం రిజర్వేషన్లను సమర్థిస్తూనే, వారిలో 'క్రీమీలేయర్' వర్గాలను మినహాయించాలని స్పష్టం చేసింది. ప్రస్తుతం వార్షిక ఆదాయం రూ. 8 లక్షలు దాటిన వారితో పాటు.. ఉన్నత రాజ్యాంగ పదవుల్లో ఉన్నవారు, ఐఏఎస్, ఐపీఎస్ వంటి సీనియర్ బ్యూరోక్రాట్లు, మిలిటరీలో టాప్ ఆఫీసర్ల పిల్లలను ఆదాయంతో సంబంధం లేకుండా క్రీమీలేయర్ కింద పరిగణించి కోటా నుంచి మినహాయిస్తున్నారు. అయితే, ఈ మినహాయింపులను సవాల్ చేస్తూ కోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. ఇక, ఈ కేసులో సుప్రీంకోర్టు.. కేంద్ర ప్రభుత్వానికి, ఇతర సంబంధిత వర్గాలకు నోటీసులు జారీ చేస్తూ తదుపరి విచారణను వాయిదా వేసింది.

## నీట్ పేపర్ లీకేజీలో దర్యాప్తు ముమ్మరం

హాజరైనట్లు పేర్కొంది. ఈ ఆసుపత్రిలోనే నీట్ గెస్ పేపర్ లీకైనట్లు సీబీఐ నిర్ధారించింది. ఈ నేపథ్యంలో శివరాజ్ కుమారుడు, డాక్టర్ మనోజ్ మేనకోడలు, మేనల్లుడిని కూడా సీబీఐ అధికారులు విడివిడిగా ప్రశ్నించారు. మరోవైపు నీట్ పరీక్షకు ముందు కుమార్తె కోసం లీకైన ప్రశ్నాపత్రాన్ని రూ. 5 లక్షలకు కొనుగోలు చేసినట్లు భావురావు కదమ్‌పై ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో నాందేడ్‌లోని ఆ నివాసంపై సీబీఐ రైడ్ చేసింది. సుమారు ఎనిమిది గంటల పాటు జరిగిన సోదాల్లో కీలక పత్రాలను సీబీఐ అధికారులు పరిశీలించారు. భావురావు కుటుంబ సభ్యులను కూడా ప్రశ్నించారు. తదుపరి విచారణ కోసం పుణెలోని తమ కార్యాలయానికి రావాలని భావురావు, ఆయన కుటుంబ సభ్యులను సీబీఐ ఆదేశించింది.అయితే మే 3న నీట్ ఎగ్జామ్‌ను నిర్వహించగా పేపర్ లీక్ ఆరోపణల నేపథ్యంలో మే 12న ఆ పరీక్షను ఎన్టీఏ రద్దు చేసింది. ఈ నేపథ్యంలో నీట్ పేపర్ లీక్‌లో పూణె, లాతూర్, నాందేడ్ వ్యక్తుల మధ్య సంబంధాలను సీబీఐ పరిశీలిస్తున్నది. నీట్ లీక్ పేపర్‌ను ఎంత మంది తల్లిదండ్రులు , ఎంతెంతకు కొనుగోలు చేశారు అన్నది దర్యాప్తు చేస్తున్నది.

## డిజిటల్ ట్రాన్స్ ఫర్మేషన్‌లో రోల్ మోడల్‌గా తెలంగాణ

ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... ప్రస్తుతం గ్లోబల్ ఎకానమీ ఊహించని వేగంతో డిజిటల్ వైపు దూసుకుపోతోందని, సంప్రదాయ పద్ధతుల స్థానంలో వ్యవస్థను రీ-డ్గి÷న్ చేసే సరికొత్త డిజిటల్ ఈక్వేషన్స్ తెరపైకి వచ్చాయన్నారు. ఈ గ్లోబల్ డిజిటల్ ట్రాన్స్ ఫర్మేషన్ కు అనుగుణంగా మార్పుల్ని అందిపుచ్చుకునే దేశాలకే భవిష్యత్తు ఉంటుందన్నారు. ప్రపంచం లోనే అతిపెద్ద డిజిటల్ ఆర్థిక వ్యవస్థల్లో భారత్ ఒకటిగా నిలిచిందన్నారు. డిజిటల్ పేమెంట్స్ నుంచి డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వరకు... మనం సాధిస్తున్న పరివర్తనను ప్రపంచం ఆసక్తిగా గమనిస్తోందన్నారు. ఈ గ్లోబల్ డిజిటల్ ట్రాన్స్ ఫర్మేషన్ లో భారత్ సాధిస్తున్న ప్రగతికి తెలంగాణ ఒక గ్రోత్ ఇంజన్ లా మారిందన్నారు. భావితరాల అవసరాలకు అనుగుణంగా నెక్స్ట్ జనరేషన్ ఇన్నోవేషన్స్, టాలెంట్, ఎకనామిక్ గ్రోత్.. ఈ మూడింటినీ నడిపించే ఒక బలమైన ఎకోసిస్టంను ఇప్పటి నుంచే అభివృద్ధి చేస్తున్నామన్నారు. 2047 నాటికి దేశ జీడీపీలో మన వాటాను10 శాతానికి చేర్చాలనే సంకల్పంతో ముందుకెళ్తున్నామన్నారు. ఒకప్పుడు కేవలం సంప్రదాయ బుక్ కీపింగ్, అకౌంట్స్ ఆడిటింగ్‌కే పరిమితమైన సీఏలు.. నేడు కార్పొరేట్ సంస్థలకు 'స్ట్రాటజిక్ బిజినెస్ అడ్వైజర్స్'గా రూపాంతరం చెందారన్నారు. ఏఐ, డేటా అనలిటిక్స్, సైబర్ సెక్యూరిటీ తదితర ఎమర్జింగ్ టెక్నాలజీస్ వల్ల ÷నాన్స్ రంగంలో సరికొత్త అవకాశాలు... అదే స్థాయిలో సైబర్ మోసాలు, డీప్‌ఫేక్స్, సైబర్ అరెస్ట్, క్రిప్÷-టో ఫ్రాడ్స్ తదితర సవాళ్లు కూడా తెరపైకి వచ్చాయన్నారు. ఇలాంటి తరుణంలో సీఏలు కేవలం ÷నాన్షియల్ ఆడిటింగ్‌కే పరిమితం కాకుండా... 'సైబర్ అష్యూరెన్స్'కూ ప్రాధాన్యమివ్వాల్సిన అవసరముందన్నారు. మారుతున్న ట్రెండ్స్ కు స్కిల్లింగ్, అప్ స్కిల్లింగ్, రీ స్కిల్లింగ్ పై దృష్టి సారించాలని సూచించారు. ఈ అంశంలో రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఅండ్ఏజీ ఆనంద్ మోహన్ బజాజ్, సెర్ట్ ? ఇన్ జాయింట్ డైరెక్టర్ అభిషేక్ సోలంకి, ప్రిన్సిపల్ డైరెక్టర్ ఆఫ్ ఇన్ కం ట్యాక్స్ ఇన్వెస్టిగేషన్ రాజగోపాల్ శర్మ, సెబీ సీజీఎం సాహిల్ మాలిక్, తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఎస్పీ హర్షవర్ధన్, ఆర్బీఐ సీజీఎం శైలజా రాణి జంపాల, ఎన్ ఎస్ ఈ సీఐఎస్వో రాజేష్ థాపర్, డేటా సెక్యూరిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సీఈవో వినాయక్ గాడ్సే తదితరులు పాల్గొన్నారు.

## అదనపు ఆదాయ వనరుల పెంపుపై దృష్టి పెట్టండి

అనుగుణంగా నిధుల సమీకరణ జరగాలని స్పష్టం చేశారు. బడ్జెట్ లక్ష్యాలను చేరుకోవడానికి అధికారులు లీకేజీలను పూర్తిగా అరికట్టాలని, అందుబాటులో ఉన్న అన్ని రకాల ఆదాయ వనరులను పూర్తి స్థాయిలో అందిపుచ్చుకోవాలని ఆదేశించారు. ముందస్తుగా నిర్దేశిరచుకున్న టైమ్ లైన్ ప్రకారమే అన్ని శాఖల అధికారులు ఆదాయాన్ని పెంపొందించేందుకు శ్రమించాలని స్పష్టం చేశారు. ప్రతి శుక్రవారం నిర్వహించే ఈ సమావేశం ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకొని అన్ని శాఖల ఉన్నతాధికారులు తప్పనిసరిగా ఈ సమావేశానికి హాజరు కావాలన్నారు. అనివార్య కారణాలవల్ల ఈ సమావేశానికి రానటువంటి వారు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరవ్వాలని ఆదేశించారు. రాష్ట్ర ఖజానాకు గండి కొడుతున్న అక్రమార్కులపై కఠినంగా వ్యవహరించాలని మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి అధికారులను అధికారులను ఆదేశించారు . రాష్ట్ర క్యాబినెట్ గతంలో ఇచ్చిన ఆదేశాల మేరకు.. మే 28 నుంచి రాష్ట్రవ్యాప్తంగా సవరించిన భూముల మార్కెట్ విలువలు అమలులోకి రానున్నాయని అధికారులు ఈ సమావేశం లో మంత్రుల బృందానికి వివరించారు. దీని ద్వారా రిజిస్ట్రేషన్ల శాఖ ఆదాయం గణనీయంగా పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. అలాగే పరిశ్రమల శాఖకు సంబంధించిన 'హిల్ట్ పాలసీ గైడ్‌లైన్స్' సిద్ధమయ్యాయని, వీటికి సంబంధించిన ఉత్తర్వులు తక్షణమే వెలువడనున్నాయని అధికారులు వెల్లడించారు. ఈ ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్, హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ , పరిశ్రమలు, రిజిస్ట్రేషన్లు, మైనింగ్, రెవెన్యూ, రవాణా తదితర కీలక శాఖలలో ప్రస్తుత వనరుల పురోగతి, రాబోయే రోజుల్లో సాధించాల్సిన ఆదాయ లక్ష్యాలపై మంత్రుల బృందం అధికారులకు దిశా నిర్దేశర చేసింది. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణారావు, ఆర్ అండ్ బి స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్, ÷నాన్స్ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, మైన్స్ ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీధర్, రెవిన్యూ సెక్రటరీ లోకేష్ కుమార్, టీజీఐఐసీ వైస్ చైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ శశాంక్ తదితరులు పాల్గొన్నారు.

# పెరుగుతున్న ఎండల తీవ్రత

### వడదెబ్బతో భూపాలపల్లిలో నలుగురు మృతి

**వరంగల్,మే22 :** తెలంగాణలో ఎండలు రోజురోజుకీ మరింత తీవ్రరూపం దాల్చుతున్నాయి. ముఖ్యంగా ఉమ్మడి వరంగల్ జిల్లా నిప్పులకొలిమిలా మారింది. భూపాలపల్లిలో వడదెబ్బతో ఒక్కరోజే నలుగురు మృతి చెందడం ఆందోళన కలిగిస్తోంది. రేగొండ మండలం భాగిర్తిపేటకు చెందిన యాకూబ్(45), మొగుళ్లపల్లి మండలం పోతుగల్లుకు చెందిన సక్కమ్మ(59), చిట్యాల మండలం చల్లగరిగేకు చెందిన పోషయ్య, కాటారం మండలం శంకరంపల్లికి చెందిన సమ్మక్క(65) వడదెబ్బ బారినపడి ప్రాణాలు కోల్పోయారు. రాష్ట్రవ్యాప్తంగా గురువారం ఒక్కరోజే 22 మంది వడదెబ్బతో మృతి చెందినట్లు తెలుస్తోంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే తొమ్మిది మంది వడదెబ్బ బారినపడి మరణించడం ఆందోళన కలిగిస్తోంది. భానుడి భగభగలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మధ్యాహ్నం సమయంలో బయటకు రావడానికి కూడా ప్రజలు భయపడుతున్నారు. అత్యధిక ఉష్ణోగ్రతల కారణంగా వడదెబ్బ మరణాలు కూడా పెరుగుతున్నాయి. తీవ్రమైన ఎండలతో చిన్నపిల్లలు, వృద్ధులు, బయట పనులు చేసే కార్మికులు ఎక్కువగా ఇబ్బందులు పడుతున్నారు. నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. అత్యవసరం అయితే తప్ప మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు బయటకు వెళ్లొద్దని హెచ్చరిస్తున్నారు. ఎక్కువగా నీరు, మజ్జిగ, కొబ్బరి నీళ్లు వంటి ద్రవాలు తీసుకోవాలని సూచిస్తున్నారు. అలాగే వడదెబ్బ లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించడం అవసరమని ఆరోగ్యశాఖ అధికారులు తెలిపారు.

# హత్యారాజకీయాలు జగన్‌కు వెన్నతో పెట్టిన విద్య

- జగన్ చరిత్ర తెలిసిన వారికి ఇవన్నీ అర్థం అవుతాయి
- వైఎస్ మరణం, వివేకా మరణంపై జగన్‌వైపే అనుమానాలు
- జగన్ వ్యాఖ్యలపై ఘాటుగా స్పందించిన మంత్రి అచ్చన్నాయుడు



**అమరావతి, మే 22 :** హత్యా రాజకీయాలు, అక్రమాల్లో ఆరితేరిన ఘనుడు జగన్ అని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఆయన చరిత్ర చూస్తే ఇదే కనిపిస్తుందని అన్నారు. ఇటీవల వైఎస్ జగన్ ఇమీడియా సమావేశంలో చేసిన కొన్ని సంచలన వ్యాఖ్యలపై మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తమ కుటుంబంలో జరిగిన మరణాలకు సీఎం చంద్రబాబు నాయుడే కారణమంటూ వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై మంత్రి అచ్చెన్నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన ప్రవర్తన చూస్తుంటే 'అపరిచితుడు' సినిమా పాత్ర గుర్తుకొస్తోందని ఎద్దేవా చేశారు. వైఎస్ జగన్ తాత వైఎస్ రాజారెడ్డిని ఎందుకు హత్య చేశారో ఈ రాష్ట్రంలో ఉన్న ప్రతి ఒక్కరికీ తెలుసని అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. వైఎస్ కుటుంబం నడిపిన దమనకాండను, అరాచకాలను ఆనాటి బాధితుడు పార్థసారథిరెడ్డి స్వయంగా వివరించారని గుర్తుచేశారు. రాజారెడ్డి హత్య కేసులో నిందితులుగా ఉన్న వారందరినీ కాలక్రమేణా తుదముట్టించారు. అయితే, రాజారెడ్డి హత్యకేసులో ఉన్న వ్యక్తి ఇవాళ వైసీపీలోనే కొనసాగుతుండటం.. జగన్ ద్వంద్వ నీతికి నిదర్శనమని విమర్శించారు. వైఎస్ కుటుంబానికి ఉన్న క్రూరత్వం, అరాచకాల చరిత్ర ప్రస్తుత తరానికి పూర్తిగా తెలియాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. అసెంబ్లీలో చంద్రబాబు నాయుడు మాట్లాడిన రెండు రోజులకే వైఎస్ రాజశేఖరరెడ్డి హెలికాప్టర్ ప్రమాదంలో చనిపోయారంటూ జగన్ చేస్తున్న ప్రచారం సిగ్గుమాలిన చర్యగా అభివర్ణించారు. ఆనాడు అసెంబ్లీలో చంద్రబాబు మాట్లాడిన మాటల అసలు సందర్భాన్ని వివరిస్తూ.. తిరుమల వేంకటేశ్వర స్వామికి ఎవరైనా కీడు తలపెడితే వారికి ఎప్పటికీ మంచి జరగదు అని మాత్రమే చంద్రబాబు అన్నారని గుర్తు చేశారు. ఆ మాటలను జగన్ ఇవాళ తన స్వార్థం కోసం వక్రీకరిస్తున్నారని మండిపడ్డారు. గతంలో వైఎస్సార్ మరణం వెనుక 'రిలయన్స్' సంస్థ పాత్ర ఉందంటూ నానా హంగామా చేసి.. ఇప్పుడు చంద్రబాబును లాగడంలో అర్థం లేదన్నారు. ఇప్పటికైనా జగన్ ఇలాంటి వక్రీకరణలు మానుకోవాలని హితవు పలికారు. జగన్ బాబాయ్, మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి ఎలా చనిపోయారో, ఆ హత్య వెనుక ఎవరున్నారో రాష్ట్ర ప్రజలందరికీ స్పష్టంగా తెలుసని అచ్చెన్నాయుడు అన్నారు. మొదట గుండెపోటు అని నమ్మించే ప్రయత్నం చేసి, ఆపై గొడ్డలితో నరికి చంపిన చరిత్ర వారిదేనని, అందుకే వైసీపీని తాము 'గొడ్డలి పార్టీ' అని పిలుస్తున్నామని స్పష్టం చేశారు.

## రెండో వారం 'నో వెహికల్ డే' పాటించిన నిమ్మల

- పాలకొల్లు నుంచి రైలులో విజయవాడకు రాక
- అక్కడి నుంచి సైకిల్‌పై పార్టీ కార్యాలయానికి చేరిక



**పాలకొల్లు,మే22 :** రెండో వారం 'నో వెహికల్ డే' సందర్భంగా మంత్రి నిమ్మల రామానాయుడు రైలులో ప్రయాణించారు. శుక్రవారం పాలకొల్లు నుంచి ట్రైన్‌లో సాధారణ ప్రయాణికులతో కలిసి విజయవాడకు మంత్రి చేరుకున్నారు. రామవరప్పాడు రైల్వే స్టేషన్ నుంచి మంగళగిరి పార్టీ కేంద్ర కార్యాలయం వరకు సైకిల్‌పై వెళ్లారు. వరుసగా రెండో వారం కూడా నో వెహికల్ డే సందర్భంగా సుమారు 18 కిలోమీటర్ల మేర మంత్రి నిమ్మల సైకిల్ తొక్కారు. తాడేపల్లి దగ్గర నిమ్మలకు టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్ స్వాగతం పలికారు. ఒకే సైకిల్‌పై ఇద్దరూ కూడా పార్టీ కార్యాలయానికి వెళ్లారు. జగన్ ఒక పిచ్చి తుగ్లక్ అంటూ మంత్రి నిమ్మల రామానాయుడు వ్యాఖ్యానించారు. పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. జగన్ మావిగన్ అంటే కూటమి భయపడటం లేదని.. ప్రజలే భయపడుతున్నారని తెలిపారు. అధికారం కోసం జగన్ ఎంతకైనా తెగిస్తారని మండిపడ్డారు. హత్యా రాజకీయాలు జగన్‌కు అలవాటన్నారు. అమరావతిలో జరుగుతున్న పనులు చూసి వైసీపీ అధినేతకు భయం మొదలైందని.. అందుకే అమరావతిపై విషం కక్కుతున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ మళ్లీ సీఎం అయితే పొట్టేలు తలల స్థానంలో ప్రజల తలలు నరుకుతారన్నారు. వచ్చే ఎన్నికల్లో జగన్‌కు 11 సీట్లు కూడా రావని మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు.

## పెన్షన్లపై జగన్ అబద్దాల ప్రచారం

### వైసిపి హాయంలోనే 11 లక్షలు తొలగింపు

### మండిపడ్డ మంత్రి కొండపల్లి శ్రీనివాస్




**అమరావతి,మే22 :** పెన్షన్‌లపై మాజీ సీఎం వైఎస్ జగన్ అవాస్తవాలు మాట్లాడుతున్నారని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మండిపడ్డారు. ఈ మేరకు మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. చంద్రబాబు హయాంలో 6 లక్షల పెన్షన్లు తొలగించారని జగన్ పచ్చి అబద్ధం చెప్పారన్నారు. జగన్ ప్రభుత్వం ఐదేళ్లలో ఏకంగా 11 లక్షల మంది నిరుపేదల పెన్షన్లను నిర్దాక్షిణ్యంగా తొలగించిందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వంలో మృతిచెందిన వారి పెన్షన్లు మాత్రమే రద్దయ్యాయని వివరించారు. కూటమి ప్రభుత్వంలో 22 నెలల్లో కొత్తగా 2.50 లక్షల మందికి పెన్షన్లు మంజూరు చేస్తే.. 6 లక్షల పెన్షన్లు తొలగించారని జగన్ అబద్దాలు మాట్లాడుతున్నారని మంత్రి ÷ర్ అయ్యారు. ఐదేళ్ల జగన్ ప్రభుత్వంలో పెన్షన్ల కోసం రు.91 వేల కోట్లు ఖర్చు చేస్తే.. కూటమి ప్రభుత్వంలో 22 నెలల్లోనే రికార్డు స్థాయిలో రూ.63,157 కోట్లు ఖర్చు చేసిందని వెల్లడించారు. జగన్ రెడ్డి అబద్ధపు ప్రచారాలను రాష్ట్ర ప్రజలు ఎవరూ నమ్మవద్దని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు

## అమరావతిపై విషం చిమ్ముతున్న జగన్

- మావిగన్ పేరుతో సొంత డబ్బా
- జగన్ వ్యవహార శైలితో ప్రజలు నవ్వుకుంటున్నారు
- విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని వ్యాఖ్య



**విజయవాడ,మే22 :** రాజధాని అమరావతిపై జగన్ విషం చిమ్ముతున్నారని.. ఆయన తన విషపు కళ్లతో అద్భుతమైన రాజధానిని చూస్తారని విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని వ్యాఖ్యానించారు. 'మావిగన్' పేరు చెప్తే సీఎం చంద్రబాబు నాయుడికి గుండె నొప్పి వస్తుందని అంటున్నారని.. మావిగన్‌తో జగన్ కామెడీ పీస్‌గా మిగిలిపోతారని ఎంపీ చిన్ని వ్యంగ్యంగా అన్నారు. ఆంధ్రాకు ఏదైనా బ్రాండ్ ఉందంటే అది చంద్రబాబు నాయుడేనని..వచ్చే ఎన్నికల్లో జగన్‌కు ఆ 11 సీట్లు కూడా రావని ఎద్దేవా చేశారు. మాజీ ముఖ్యమంత్రి వైస్ జగన్ మోహన్ రెడ్డి శాంతిదూత ప్రవచనాలు చేస్తున్నారని టీడీపీ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) మండిపడ్డారు. జగన్ నిన్న గురువారం నిర్వహించిన ప్రెస్ మీట్ చూసి రాష్ట్ర ప్రజలు ఆశ్చర్యపోయారని అన్నారు. జగన్ కుటుంబ చరిత్ర తెలియనివారు లేరని.. ప్రెస్ మీట్‌లో ఆయన మాటలు విని ప్రజలు అసహ్యించుకుంటున్నారని చెప్పారు. జగన్ మీడియా సమావేశంలో చేసిన వ్యాఖ్యలకు ఎంపీ చిన్ని కౌంటర్ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి మరణం బాధాకరమని.. ఆయన మృతిపై జగన్‌కు అనుమానాలు ఉన్నాయన్నారు. అయితే, రాజశేఖర్ రెడ్డి పార్థివదేహం ఇంటికి రాకముందే ముఖ్యమంత్రి పదవి కోసం జగన్ సంతకాల సేకరణ చేశారన్నారు. ఇదే విషయాన్ని చాలామంది సీనియర్ నేతలు తనకు చెప్పారని.. వారంతా ఇప్పుడు వైసీపీలోనే ఉన్నారన్నారు. జగన్ ప్రభుత్వంలో రౌడీయిజం రాజ్యమేలిందని ఎంపీ చిన్ని ఆరోపించారు. వైఎస్ వివేకానంద రెడ్డి సౌమ్యుడని.. ఆయన్ను దారుణంగా హత్య చేశారన్నారు. వివేకా హత్య కేసుపై ఫ్యాన్ పార్టీ అధినేత మొదట సీబీఐ విచారణ కోరారని, తర్వాత మళ్లీ వెనక్కి తగ్గారని ఎంపీ చెప్పుకొచ్చారు.

## నీచ రాజకీయాలు జగన్‌కు అలవాటే

### తండ్రి శవం ఉండానే సిఎం కోసం పైరవీ

### ఐదేళ్ల పాలనలో ఏపిని భ్రష్టు పట్టించిన ఘనుడు

### విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ విమర్శలు

**అమరావతి,మే22 :** వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి రాజకీయ లబ్ది కోసం ఎంతటి నీచానికైనా దిగుతారని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సొంత తండ్రి మరణాన్ని సైతం రాజకీయ ప్రయోజనాలకు వాడుకోవడం జగన్‌కే చెల్లిందని, ఆయన వైఖరి అత్యంత బాధాకరమని విమర్శించారు. అమరావతిలో మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. జగన్ గత ఐదేళ్ల పాలనపై, ఆయన రాజకీయ శైలిపై నిప్పులు చెరిగారు.తండ్రి చావును కూడా రాజకీయ ప్రయోజనాలకు జగన్ వాడుకోవటం బాధాకరం. 5ఏళ్లు సీఎంగా ఉండి తండ్రి, బాబాయ్ హత్యపై అనుమానాలు ఎందుకు నివృత్తి చేయలేదు. అధికాకంలో ఉన్నప్పుడు అహంకారంతో వ్యవహరించి, ఇప్పుడు అధికారం పోయేసరికి ప్రజల్లో సానుభూతి కోసం 'బీద ఏడుపులు' ఏడవడం జగన్‌కే చెల్లిందన్నారు. ప్రజల్లో సానుభూతి పొందే ఆలోచనలు విరమించుకుని, రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వామ్యమైతే జగన్ కే మంచిది. జగన్ పరిపాలన, అరాచకాలను అసహ్యించుకునే.. 2024 ఎన్నికల్లో ప్రజలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పారు. చంద్రబాబు నిర్ణయాలు నేటి తరంతో పాటు భవిష్యత్తు తరాలకూ ఉపయోగపడేలా ఉంటాయి. మూడు రాజధానులంటూ ప్రజల్లో తిరస్కరణకు గురయ్యారు.. ఇప్పుడు అమరావతి అభివృద్ధి చూసి ఓర్వలేక మావిగన్ అంటూ వితండవాదం చేస్తున్నారు. రాష్ట్రానికి, రాష్ట్రప్రజలకూ నష్టం చేసే నిలకడలేని జగన్ మాటలను ఎవరూ విశ్వసించరని మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. అమరావతి నిర్మాణంతో జగన్ తట్టుకోలేక పోతున్నారని మండిపడ్డారు.

## మావిగన్ పేరుతో మభ్యపెట్టే యత్నం

- ఐదేళ్లలో రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించిన జగన్
- గొడ్డలి పార్టీ నాయకుల పట్ల అప్రమత్తంగా ఉండాలి
- గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర



**అమరావతి, మే 22 :** మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి గడిచిన ఐదేళ్లలో అమరావతిని నాశనం చేయడమే కాకుండా.. ప్రస్తుతం మావిగన్ పేరుతో ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నారని గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర మండిపడ్డారు. శుక్రవారం తుగ్గలి మండలం జొన్నగిరిలో టీడీపీ కార్యకర్తల సమావేశంలో మంత్రి పాల్గొని ప్రసంగించారు. గత ఐదేళ్లలో రాష్ట్రాన్ని అన్ని విధాలుగా భ్రష్టు పట్టించిన వైకాపా.. ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి ఓర్వలేక పోతున్నారన్నారు. గొడ్డలి పార్టీ నాయకుల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాల్సిన బాధ్యత తెదేపా శ్రేణులపై ఉందన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో తెదేపా అభ్యర్థులు విజయం సాధించేలా కృషి చేయాలని పార్టీ నేతలకు మంత్రి సూచించారు. గత వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రానికి పెట్టుబడి పెట్టాలంటే ఎవరు రాలేని పరిస్థితి ఉండేదని మంత్రి కొల్లు రవీంద్ర వ్యాఖ్యానించారు. ఇప్పుడు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి పారిశ్రామికవేత్తలు పోటీపడి ముందుకు వస్తున్నా రన్నారు. గత ప్రభుత్వంతో పోలిస్తే మైనింగ్ శాఖలో రూ. 4 వేల కోట్లు అధికంగా రాబడి వచ్చిందని తెలిపారు. చంద్రబాబు నాయుడు పరిపాలన విధానాన్ని చూసి భారత దేశంలో వచ్చిన పెట్టుబడులలో 25 శాతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వచ్చాయని అన్నారు. జొన్నగిరిలో జియో మైసూర్ గోల్డ్ మైన్స్ లిమిటెడ్ సంస్థ.. బంగారు శుద్ధి, ఉత్పత్తికి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన యంత్ర సామాగ్రిని ఏర్పాటు చేసినట్లు మంత్రి తెలిపారు. ఒకటన్ను ముడి సరుకు నుంచి ఒక గ్రాము బంగారం వస్తుందన్నారు. ప్రస్తుతం 300 మీటర్ల వరకు తవ్వారని... భవిష్యత్తులో రెండు కిలోమీటర్ల వరకు తవ్వకాలు జరుపనున్నట్లు చెప్పారు. దేశంలోనే మొట్టమొదటి ప్రైవేట్ గోల్డ్ మైన్స్ ప్రాజెక్టు ఇది అని అన్నారు. అనంతపురం జిల్లా రామగిరి ప్రాంతంలో కూడా గోల్డ్ మైన్స్‌ను గుర్తించినట్లు తెలిపారు. బీచ్ శాండ్ ద్వారా ఖనిజ సంపదను గుర్తించడం జరిగిందన్నారు. గ్రానైట్, క్వార్ట్జ్‌కు బాగా డిమాండ్ ఉందని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వంలో మైనింగ్ దోపిడీ జరిపి జేబులు నింపుకున్నారని కొల్లు రవీంద్ర ఆరోపించారు.

## 2.5 కోట్ల విత్తన బంతుల పంపిణీ

### అటవీశాఖకు టార్గెట్ విధించిన డిప్యూటి సిఎం

**అమరావతి,మే22 :** అటవీ శాఖ ఆధ్వర్యంలో 2.5 కోట్ల విత్తన బంతులను పంపిణీ చేయాలని అధికారులను ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశించారు. వీటి తయారీ కార్యక్రమాన్ని ప్రజా ఉద్యమంగా మార్చాలని అన్నారు. అందుకు అన్ని వర్గాల ప్రతినిధులను భాగస్వామ్యం చేయాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ అటవీ శాఖపై పవన్ కళ్యాణ్ సమీక్షా సమావేశం నిర్వహించారు. జూన్ నెలలో నిర్వహించనున్న విత్తన బంతుల (సీడ్ బాల్స్) తయారీ కార్యక్రమంపై అధికారులకు ఆయన దిశానిర్దేశర చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ఏడాది వర్షాకాల సీజన్‌ను పూర్తిగా వినియోగించుకోవాలని అధికారులకు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తెలిపారు. జులై, ఆగస్టు నెలల్లో రాష్ట్రవ్యాప్తంగా విత్తన బంతులను విస్తారంగా చల్లడానికి అటవీ శాఖ ప్రణాళికలు సిద్ధం చేయాలని అన్నారు. ఇందుకోసం మూడు రకాల ప్రత్యేక పద్ధతులను ఉపయోగించాలని సూచించారు. నేరుగా చల్లడం, అత్యాధునిక డ్రోన్ సాంకేతికతను వినియోగించడం, చేతులతో నాటడం చేయాలని ఆయన పేర్కొన్నారు. అడవుల్లో జీవ వైవిధ్యాన్ని పెంపొందించడం, స్వచ్ఛమైన, పచ్చని ఆంధ్రప్రదేశ్‌ను నిర్మించడం ఈ హరిత ఉద్యమ ప్రధాన లక్ష్యమని పవన్ చెప్పుకొచ్చారు. విత్తనం చల్లే ప్రతి విత్తన బంతి.. మన భవిష్యత్తుకు ఇచ్చే ఒక నమ్మకమైన హామీగా మారాలని ఉప ముఖ్యమంత్రి అన్నారు.

# సంపాదకీయం

## వ్యవసాయం ఈజీ..ధాన్యం అమ్మడం కష్టం

తెలుగు రాష్ట్రాల్లో ధాన్యం కొనుగోళ్లు,తరలింపు ప్రహసనంగా మారింది. కల్లాల్లో రైతుల దీనస్థితి టీవీల్లో కనిపిస్తున్నా, పత్రికల్లో వార్తలుగా వస్తున్నా..ప్రభుత్వాల్లో చలనం కానరావడం లేదు. పెద్దపెద్ద మాటలు మాట్లాడుతున్న పాలకులకు సామన్య రైతుల వేదన కనిపించడం లేదు. ఎవరు పాలనలో ఉన్నా ఇదే దుస్థితి ఉంది. తమ హయాంలో గొప్పగా చేశామని చెప్పుకుంటున్న బిఆర్ఎస్ హాయంలోనూ ఇవే దృశ్యాలు కనిపించాయి. రైతులు పండించిన పంటలను కొనుగోలు చేయడం ప్రభుత్వాల బాధ్యత. లేదా ఏ పంటను కొంటారో చెప్పి అవే పంటలను పండించేలా ప్రణాళికలు సిద్దం చేయాలి. కానీ అలా జరగడం లేదు. కెసిఆర్ హయాంలో వరేస్తే ఉరే అంటూ చెప్పిన మాటలను అప్పుడే మర్చిపోతే ఎలా. దీనికి కెటిఆర్ సమాధానం చెప్పాలి. కానీ ప్రభుత్వంపై నిందలు మోపడం తప్ప గ్రామాలకు వెళ్లి, ప్రభుత్వాన్ని ఒప్పించి కొనుగోళ్లు చేయించే పాత్రను ప్రతిపక్షం తీసుకోవడం లేదు. ఇకపోతే ఇప్పుడేమో మంత్రులు చెప్పేదొకటి గ్రామాల్లో కనిపిస్తున్నదొకటి. వర్షాకాలం దగ్గర పడడంతో పాటు, అకాల వర్షాలతోనూ రైతులు నానా ఇబ్బందులు పడ్డారు. పలుచోట్ల కల్లాల్లో ధన్యం తడిసి కొట్టుకుపోయింది. రోజులతరబడి కొనుగోలు కేంద్రాల్లో రాత్రనక పగలనకా గోస పడుతున్నా.. అధికారులు కనికరిస్తలేరని అన్నదాతలు ఆవేదన చెందుతున్న తీరును ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. ఈ దేశంలో రైతులంటే అందిరికీ చులకనగా మారింది. ధాన్యం సేకరణపై ఇటీవల సిఎం రేవంత్ రెడ్డి అధికారులతో సమీక్షించారు. అయినా పరిస్థితిలో మార్పు రాలేదు. ధాన్యం కాంటా వేయడం లేదు. వేసిన ధాన్యం లారీలకు ఎక్కడం లేదు. లారీలకు ఎక్కేవరకు రైతులే కాపలాగా ఉండాల్సి వస్తోంది. ఆరుగాలం కష్టించి పండించిన పంటను అష్టకష్టాలు పడి కొనుగోలు కేంద్రాలకు తెస్తే రోజుల తరబడి వేచి చూసేలా చేయడం పాలకుల వైఫల్యం తప్ప మరోటి కాదు. ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి పక్కా ప్రణాళిక లేకపోవడమే ఈ దుస్తితికి కారణం. ఇకపోతే తెచ్చిన ధాన్యం అకాల వర్షాలకు ఎక్కడ తడుస్తుందోనని ఆందోళన చెందుతున్నరు. మరోవైపు తాలు, తడిసిందన్న కారణాలతో రకరకాల కొర్రీలు పెడుతూ నిలుపు దోపిడీ చేస్తున్న తీరు ఏ గ్రామం వెళ్ళినా కనిపిస్తుంది. కొనుగోలు కేంద్రంలో యంత్రాల కోసం గొడవలు, సీరియల్ నంబర్, వంతుల పేరిట నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇక పండిన ధాన్యం రోడ్డుపైన ఆరబెట్టేందుకు ఉదయం రోడ్డుపై నేర్పుకోవాలి, సాయంత్రం టార్పాలిన్ కప్పి కాపలాకాయాల్సిన పరిస్థితి ఏర్పడింది. వర్షాలకు తడుస్తున్న వడ్లు మొలకెత్తుతుంది. కొనేటప్పుడు ఏం పరిస్థితి ఉంటుందోననే భయం పట్టుకున్నది. తడిసిన వడ్లను కూడా ప్రభుత్వం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాల్సిన బాధ్య ఉంది. ఇలాంటి కష్టాల వల్ల సన్నకారు రైతుల నడ్డి విరుగుతోంది. ఎప్పుడు కొనుగోలు చేస్తారోనన్న ఎదురుచూపులకే రోజులు గడిచిపోతున్నాయి. ఎప్పుడు వానొస్తదో తెలియక భయంతో బతుకుతున్నారు. ముఖ్యంగా లారీలు రావడం లేదని ధాన్యం తరలించడం లేదు. చాలాచోట్ల కడుపు మండిన రైతులు రోడ్డెక్కుతున్నరు. తెచ్చిన ధాన్యం కాంటా వేసి, లారీల్లో తరలించే ఏర్పాట్లు చేస్తే ఈ దుస్థితి రాదు. తక్షణం ప్రభుత్వం స్పందించి ఒకటి,రెండు రోజుల్లో అన్‌లోడ్ చేయించేలా చర్యలు తీసుకోవాలి. లారీలు, హమాలీల కొరత కారణంగా రవాణాలో జాప్యం జరుగుతున్నది. ప్రజాప్రతినిధులు రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదు. ధాన్యం అమ్ముకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్న రైతులను పాలకపక్ష నేతలు పరామర్శించడం లేదు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల వద్ద కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయలేదు. వర్షం పడితే ధాన్యం తడిసిపోతుంది. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో తూకం వేయకపోవడంతో ఎండలో ఆరబోస్తున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు తూకం వేసిన గన్నీ బస్తాలు ఉండటం లేదు. లారీలు సకాలంలో రావడం లేదు. దీంతో ధాన్యం మిల్లులకు తరలించే వరకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నరు. అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. లారీల సమస్య తీవ్రంగా ఉన్నదని, అదనంగా డబ్బులు ఇవ్వాలని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు చెప్తున్నారు. ఈ యాసంగి సీజన్‌లో ధాన్యం కొనుగోళ్లలో అడుగడుగునా రవాణా కష్టాలు నిత్యం ఎదురవుతున్నాయి. హమాలీలు అందుబాటులో లేకపోవడంతో పాటుగా లారీల కొరత వేధిస్తుండటంతో కల్లాల్లో ధాన్యం నిలిచి పోతుంది. రోజుల తరబడి వేచి చూస్తే కానీ ధాన్యం అమ్ముకునే పరిస్థితి లేకుండా పోయింది. దొడ్డు ధాన్యాన్ని దించుకునేందుకు రైస్ మిల్లర్లు తీవ్రంగా సతాయిస్తున్నారు. నాలుగైదు కిలోలు తరుగు పేరిట దోచేస్తున్నారు. లేదంటే లారీల్లోని ధాన్యం సంచులు దించుకునేందుకు ససేమిరా అంటున్నారు. లారీల యజమానులు సైతం సంచికి రూ.4వరకు వసూళ్లకు పాల్పడుతున్నట్లుగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. రైస్ మిల్లర్లకు తోడుగా పీఏసీఎస్ సెంటర్లలో సహకార సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నారు. రైతులను నిలువునా ముంచేస్తున్నారు. ధాన్యం తరలించడంలో జాప్యం జరుగుతుండటం తో రైతులు రోడ్డు ఎక్కి ఆందోళనలు చేయాల్సి వస్తోంది. ఎక్కడ చూసినా గన్నీ సంచులు లేవని, లారీలు వస్తలేవని మక్కలు కాంటా వేస్తలేరని రైతులు వాపోతున్నారు. కాంటా పెట్టాలని అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదు. గన్నీ సంచులు లేవు మీరే కొనుక్కోవాలని అంటున్నారు. రైతులకు ఇది జీవన్మరణ సమస్యగా మారింది. ప్రభుత్వం వెంటనే దీనిపై దృష్టి సారించాలి. కలెక్టర్లు కూడా పెద్దగా పట్టించుకోవడం లేదని పరిస్థితులు చెబుతున్నాయి. ఈ సమస్యను ఎలా పరిష్కరిస్తారన్నది పాలకుల చిత్తశుద్దిపై ఆధారపడి ఉంది.

# కెటిఆర్‌తో ఉమ్మడి జిల్లా నేతల భేటీ





### సభ్యత్వ నమోదుపై నేతల చర్చ

నిజామాబాద్,మే22 : ఉమ్మడి నిజామాబాద్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులతో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ భేటీ అయ్యా రు. హైదరాబాద్‌లోని మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి నివాసంలో నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు చెందిన నియోజకవర్గ ఇన్‌చార్జీలతో ప్రత్యేక సమావేశం అయ్యారు. బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు ప్రక్రియతో పాటు, పలు అంశాలపై నేతలతో కేటీఆర్ చర్చించారు. ఈ సమావేశంలో రాజ్యసభ సభ్యుడు కేఆర్ సురేష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ గంగాధర్ గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు జీవన్ రెడ్డి, సురేందర్, బిగాల గణెశిష్‌గుప్తా , హన్మంత్ షిండే తదితరులున్నారు.

# 2000 కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్స్

- అరుదైన రికార్డ్ సాధించిన నిమ్స్
- అభినందించిన మంత్రి దామోదర్ రాజనర్సింహ



హైదరాబాద్, మే 22: నిమ్స్ హాస్పిటల్ మరో అరుదైన మైలు రాయిని చేరుకుంది. దేశంలో 2 వేల కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్లు చేసిన ప్రభుత్వ హాస్పిటల్‌గా రికార్డు సృష్టించింది. 1989లో నిమ్స్‌లో తొలి కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయగా, తాజాగా 2000ల కిడ్నీ ట్రాన్స్‌ఎ÷-లాంట్ సక్సెస్‌ఫుల్‌గా పూర్తి చేసినట్టు నిమ్స్ డైరెక్టర్, డాక్టర్ బీరప్ప శుక్రవారం ప్రకటించారు. నిమ్స్ యూరాలజీ, నెఫ్రాలజీ విభాగం డాక్టర్లు, సిబ్బంది అద్భుతమైన పనితీరుతోనే ఈ అచీవ్‌మెంట్‌ను సాధించగలిగామని బీరప్ప తెలిపారు. పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు నిమ్స్‌కు సంపూర్ణ సహకారం అందిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహకి బీరప్ప కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పటివరకు 2000 మంది కిడ్నీ రోగులకు నూతన జీవితం ప్రసాదించిన నిమ్స్.. ముఖ్యంగా పేద, మధ్యతరగతి కుటుంబాలకు పెద్ద అండగా నిలిచింది. కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సల్లో దాదాపు 95 శాతం మంది రోగులు ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయనిధి(సీఎంఆర్ఎఫ్) ద్వారా పూర్తిగా ఉచితంగా చికిత్స పొందినట్లు బీరప్ప వెల్లడించారు. శస్త్రచికిత్స మాత్రమే కాకుండా, అవయవ మార్పిడి అనంతరం జీవితాంతం అవసరమయ్యే మందులను కూడా ఆరోగ్యశ్రీ పథకం కింద ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా నిమ్స్ యూరాలజీ విభాగం హెడ్, డాక్టర్ రాహుల్ రాజ్‌ను బీరప్ప అభినందించారు. యూరాలజీ విభాగం ఆధ్వర్యంలోనే ఈ ఘనత సాధ్యమైందని ఆయన పేర్కొన్నారు. క్లిష్టమైన బహుళ రక్తనాళాల కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలు, చిన్నారుల్లో ట్రాన్స్‌ఎలాంట్లు, రీ-ట్రాన్స్‌ప్లాంట్లు వంటి సవాలుతో కూడిన ఆపరేషన్లను యూరాలజీ టీమ్ విజయవంతంగా నిర్వహించిందని ఆయన పేర్కొన్నారు. దక్షిణ భారతదేశంలో ప్రభుత్వ హాస్పిటల్‌లో తొలి రోబోటిక్ కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ కూడా నిమ్స్‌లోనే నిర్వహించడం విశేషం.నిమ్స్ వైద్య బృందం సాధించిన ఈ అరుదైన ఘనతపై ఆరోగ్యశాఖమంత్రి దామోదర్ రాజనర్సింహ అభినందనలు తెలిపారు. ప్రభుత్వ హాస్పిటల్స్‌లోనూ అత్యాధునిక వైద్యం అందించగల సామర్థ్యం తెలంగాణకు ఉందని నిమ్స్ మళ్లీ మళ్లీ నిరూపిస్తోందన్నారు. ప్రభుత్వ హాస్పిటళ్లలో అవయవ మార్పిడి సేవలను మరింత విస్తరించి, పేదలకు ఉచితంగా అత్యాధునిక, ఖరీదైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఈ సందర్భంగా మంత్రి గుర్తు చేశారు. ఇటీవల గాంధీ హాస్పిటల్‌లో 6 మాడ్యులర్ ఆపరేషన్ థియేటర్లతో పాటు అత్యాధునిక వసతులతో కూడిన ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంట్ సెంటర్‌ను ఏర్పాటు చేసిన విషయాన్ని ఈ సందర్భంగా మంత్రి గుర్తు చేశారు. అలాగే, సనత్‌నగర్‌లోని టిమ్స్ హాస్పిటల్‌లో కూడా ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంట్ ఎక్సలెన్స్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆర్గాన్ రిట్రైవల్ సెంటర్లను సైతం అందుబాటులోకి తీసుకొస్తున్నామని మంత్రి వెల్లడించారు. దీంతో ప్రభుత్వ రంగంలోనే అత్యాధునిక అవయవ మార్పిడి సేవలు మరింత విస్తృతంగా అందుబాటులోకి వస్తాయన్నారు.

# 3 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం

- తెలంగాణ వృద్ధి రేటు 10.7 శాతం
- దేశ సగటు కంటే వేగంగా వృద్ధి రేటు
- పట్టణీకరణతో సేవల రంగానికి భారీ అవకాశాలు
- విద్యార్థుల రుణాలు భవిష్యత్ పెట్టుబడులు
- రూ.5 లక్షల నుంచి రూ. 10 లక్షలకు వడ్డీ లేని రుణాలు
- బ్యాంకర్ల సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క




హైదరాబాద్,మే22 : సంక్షేమ పథకాలు, ఆర్థిక స్వావలంబన, ఫ్యూచర్ సిటీ నిర్మాణం, మహిళా సాధికారత, మూసీ పునరుజ్జీవంపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రథమ ప్రాధాన్యతలను ఇస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. శుక్రవారం మహాత్మాజ్యోతి రావు పూలే ప్రజాభవన్ లో జరిగిన 49వ రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ బ్యాంకర్ల సమావేశంలో మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, స్పెషల్ చీఫ్ సెక్రెటరీ దాన కిషోర్, ÷నాన్స్ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ÷నాన్స్ - ఎ÷-లానింగ్ సెక్రెటరీ గౌరవ్ ఉప్పల్, ఆర్బీఐ రీజనల్ డైరెక్టర్ చిన్మయ మోహన్, ఎస్బీఐ సీజీఎం నీలేష్ ద్వివేది తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. 20147 నాటికి తెలంగాణ 3 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థగా నిలిపేందుకు ప్రజా ప్రభుత్వం కృతనిశ్చయంతో పనిచేస్తోందని డిప్యూటీ సీఎం స్పష్టంగా చెప్పారు. రాష్ట్రంలో బ్యాంకుల మొత్తం డిపాజిట్లు దాదాపు రూ.9.43 లక్షల కోట్లకు చేరుకోవడం, అడ్వాన్సులు రూ.12.34 లక్షల కోట్లకు చేరుకోవడం గొప్ప విషయమని చెప్పారు. రాష్ట్రం 130.78 శాతం క్రెడిట్-డిపాజిట్ నిష్పత్తితో ముందుకు సాగడం అద్వితీయ విషయని ఆయన చెప్పారు. వ్యవసాయ రుణాల విషయంలో లక్ష్యాలను మించి బ్యాంకులు రుణాలు ఇవ్వడం సంతోషకరమని అన్నారు. రూ.1,65,297 కోట్ల లక్ష్యానికి గాను రూ.1,68,401 కోట్ల వ్యవసాయ రుణాలు పంపిణీ చేసి 101.88 శాతం సాధించడం గర్వించదగ్గ విషయంగా చెప్పారు. వ్యవసాయం తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక. రైతులు, పాడి రైతులు, మత్స్యకారులు మరియు అనుబంధ రంగాలకు కిసాన్ క్రెడిట్ కార్డు సహా వివిధ పథకాల ద్వారా బ్యాంకులు అందిస్తున్న మద్దతు అభినందనీయం అని చెప్పారు. తెలంగాణ రాష్ట్రం పారిశ్రామిక రంగంలో దేశంలోనే అత్యంత వేగవంతంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో ఒకటని డిప్యూటీ సీఎం చెప్పారు. ఈ నేపథ్యంలో బ్యాంకులు సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలు, మహిళ, దళిత, గిరిజన యువ పారిశ్రామికవేత్తలకు రుణాల పంపిణీపై బ్యాంకులు మరింత దృష్టి పెట్టాలని అన్నారు. విద్యార్థులకు ఇచ్చే రుణాల విషయంలో బ్యాంకులు మరింత సానుకూల దృక్పథంతో ముందుకు రావాలని ఆయన చెప్పారు. విద్యార్థులకు ఇచ్చే రుణాలు యువతపై మనం పెట్టే భవిష్యత్ పెట్టుబడి అని ఆయన చెప్పారు. సంక్షేమం-అభివృద్ధి రెండింటిని జోడెడ్లుగా పరుగులు తీయగలవని ప్రజాప్రభుత్వం చేతల్లో నిరూపించిందని అన్నారు. సమగ్రాభివృద్ధి, రైతు సంక్షేమం, మహిళా సాధికారత, ఉపాధి సృష్టి పట్ల మా ప్రభుత్వం కట్టుబడి ఉందని మరోసారి ఆయన పునరుద్ఘాటించారు. నేడు ప్రపంచమంతా పునరుత్పాదక ఇంధనరంగంపై దృష్టి సారిస్తోందన్నారు. అందులో భాగంగా ప్రజాప్రభుత్వం కూడా సౌరశక్తి విభాగంలోస్థిరమైన ప్రగతిని సాధిస్తోందన్నారు. సౌరశక్తి ప్రాజెక్టులు, రూఫ్‌టాప్ సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు మరియు ఇతర పర్యావరణ అనుకూల కార్యక్రమాలకు బ్యాంకులు చురుగ్గా రుణ సహాయం అందించాలని ఉప ముఖ్యమంత్రి సూచించారు. సామాజిక భద్రత, బీమా పథకాల పరిధిలోకి రాష్ట్ర ప్రజలను తీసుకురావాలన్నారు. బ్యాంకులు కేవలం డబ్బు డిపాజిట్ చేసే, రుణాలు ఇచ్చే ఆర్థిక సంస్థలుగానే కాకుండా, రాష్ట్ర వ్యూహాత్మక అభివృద్ధి భాగస్వాములుగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ప్రజల డబ్బు అంతా బ్యాంకులకే చేరుతుంది, కాబట్టి ఆ నిధులను ఏ రంగాల అభివృద్ధికి రుణాలుగా ఇస్తున్నామనేది చాలా ముఖ్యం. రాష్ట్ర ఆర్థిక వృద్ధికి, ఉపాధికి ఏ రంగం ఎక్కువ దోహదపడుతుందో ఆలోచించి బ్యాంకులు వ్యూహాత్మకంగా రుణాలు అందించాలన్నారు. ప్రజాప్రభుత్వం 2047 ఆర్థిక సంవత్సరం నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇది పెద్ద కల. తెలంగాణ ప్రస్తుత వృద్ధి రేటు చూస్తుంటే ఇది ఖచ్చితంగా సాధ్యమేనని స్పష్టం చేశారు. ప్రస్తుతం దేశ సగటు వృద్ధి రేటు 8.2? గా ఉంటే, తెలంగాణ వృద్ధి రేటు 10.7 శాతంతో దూసుకుపోతోందని చెప్పారు. దేశ సగటు తలసరి ఆదాయం ?2.1 లక్షలుగా ఉంటే, తెలంగాణ తలసరి ఆదాయం ?4.18 లక్షలతో దేశంలోనే అగ్రగామిగా ఉందని ఉప ముఖ్యమంత్రి గర్వంగా ప్రకటించారు. తెలంగాణ ప్రజాప్రభుత్వం మూసీ నది పునరుజ్జీవనం, ఫ్యూచర్ సిటీ నిర్మాణం, రీజినల్ రింగ్ రోడ్ నిర్మాణం అత్యంత వేగంగా పూర్తి చేయడంకూడా ప్,ధాన లక్ష్యాలుగా నిర్దేశిరచుకుని ముందుకు సాగుతోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. తెలంగాణలో వేగంగా పట్టణీకరణ జరుగుతోందని అన్నారు. ఈ నేపథ్యంలో సేవల రంగాని అధిక అవకాశాలు ఉంటాయని ఆయన చెప్పారు. హిళా ఆర్థిక సాధికారత కోసం రాష్ట్రంలోని స్వయం సహాయక సంఘాల వడ్డీ లేని రుణాలు రూ. 5 లక్షల నుంచి రూ. 10 లక్షలకు పెంచుతున్నట్లు ఈ సందర్భంగా చెప్పారు. ఈ సంవత్సరం హైదరాబాద్ నగరంలో మహిళా సంఘాలకు రుణ పంపిణీ యుద్ధప్రాతిపదికన దృష్టి సారించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. హైదరాబాద్ నగరం మహిళలకు వ్యాపార రంగంలో, చిన్న మరియు మధ్యతరహా పరిశ్రమల్లో ఎదగడానికి ఎన్నో అవకాశాలను ఇస్తోందని చెప్పారు. నగరంలోని మురికివాడల్లోని యువ మహిళా పారిశ్రామికవేత్తలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. రాష్ట్రంలో త్వరలోనే అనేక ఇండస్ట్రియల్ హబ్‌లు, క్లస్టర్లను తీసుకువస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి వెల్లడించారు. ఇందులో భాగంగా ఫార్మా, ఫ్యాబ్ సిటీ, స్టీల్, లెదర్, టెక్స్‌టైల్ వంటి వివిధ రంగాలను డిజైన్ చేస్తున్నట్లు చెప్పారు. దీని ద్వారా జాతీయ, అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పారు.

# మక్కరైతుల బొక్కబోర్లా

## కొనుగోళ్లు లేక నానా తంటాలు



నిజామాబాద్,మే22 : నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలో మక్కలు, జొన్న రైతుల పరిస్థితి మరింత అధ్వానంగా మారింది. మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో జరగాల్సిన కొనుగోళ్లు ముందుకు కదలడం లేదు. అనుమతులు రాకపోవడంతో కొనుగోళ్ల పక్రియనే చేపట్టలేదు. మే 20 నుంచి జొన్న కొనుగోళ్లకు మార్క్‌ఫెడ్ ఏర్పాటు చేసింది. ఇప్పటికే మార్కెట్ యార్డుల్లో నెలల తరబడి పంట ఉత్పత్తులతో రైతులు పడిగాపులు కాస్తూ వేచి చూస్తున్నారు. మక్క రైతుల పరిస్థితి దయనీయంగానే చేరింది. కొనుగోళ్లు తూతూ మంత్రంగా చేపట్టి చేతులు ఎత్తేశారు. రూ.2400 కనీస మద్దతు ధర అన్నది ఎక్కడా అమలు కావడం లేదు. మక్క రైతులు బాధలకు ప్రభుత్వం స్పందించడం లేదు. మార్క్‌ఫెడ్ అధికార యంత్రాంగం చేతులు ఎత్తేసినట్లే కనిపిస్తోంది. కొనుగోళ్ల విషయంపై మౌనం పాటిస్తోంది. ప్రైవేటు కొనుగోళ్లు మినహాయించగా 8లక్షల 65వేల మెట్రిక్ టన్నులు ధాన్యం సేకరించేందుకు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటి వరకు 6లక్షల 29వేల 915 మెట్రిక్ టన్నులు ధాన్యాన్ని సేకరించారు. నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా 739 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు.అన్ని చోట్ల కేంద్రాలను తెరిచారు. ప్రస్తుతం 653 చోట్ల కొనుగోళ్లు కొనసాగుతున్నాయి. 86 చోట్ల కొనుగోళ్లు పూర్తయ్యాయి. కామారెడ్డి జిల్లాలో 5లక్షల 11వేల మెట్రిక్ టన్నులు ధాన్యం సేకరించేందుకు టార్గెట్ పెట్టుకున్నారు. ఇప్పటి వరకు 3లక్షల 14వేల 589 మెట్రిక్ టన్నులు సేకరించారు. 42వేల 225 మంది రైతుల నుంచి రూ.751.55 కోట్లు చెల్లింపులు పూర్తి చేశారు. కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా 414 కొనుగోలు కేంద్రాలు ప్రతిపాదించారు. అన్ని చోట్ల కొనుగోలు కేంద్రాలు ప్రారంభించగా 329 కేంద్రాల్లో ప్రస్తుతం కొనుగోళ్లు జరుగుతున్నాయి. 67 చోట్ల కొనుగోళ్లు పూర్తి కావడంతో మూసేశారు. ఆర్భాటంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం తప్ప కొనుగోళ్లు జరగక రైతులు కల్లాలవద్దనే పడిగాపులు పడుతున్నారు. కొన్నిచోట్ల ధాన్యం తూకం వేసి మూడు రోజులైనా, లారీలు వస్తలేవని సంచులు తీసుకుని పోవడం లేదు. తూకం వేసిన బస్తాలు ఎండల్లోనే ఎండిపోతున్నాయి. డ్రైవర్లకు రూ.2 ఇస్తేనే లారీలు వస్తాయని చెబితే దానికీ ఒప్పుకున్న రైతులు అందుకు కూడా సరే అంటున్నారు.. అయినా లారీలు వస్తలేవని అంటున్నారు.



## బస్టాండ్ ఆవరణలో ప్రమాదకరంగా మూల మలుపు

### రోడ్డు వెడల్పునకై గ్రామస్తుల డిమాండ్

**బలగం, టీవీ, బోయినిపల్లి;**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం అనంతపల్లి గ్రామంలోని బస్టాండ్ ఆవరణలో ఉన్న మూలమలుపు ప్రమాదకరంగా ఉందని, మూలమలుపు వద్ద రోడ్డు వెడల్పు చెయాలనీ, రహదారి స్పష్టంగా కనిపించకపోవడంతో బస్సులు ఇతర వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ ప్రాంతంలో ఎప్పుడైనా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బస్టాండుకు వచ్చే ప్రయాణికులు, విద్యార్థులు, వృద్ధులు ఈ మలుపు వద్ద భయంతో రహదారి దాటలసిన పరిస్థితి ఏర్పడిందని వారు చెప్తున్నారు. ఈ పరిస్థితిని వెంటనే పరిష్కరించి, ప్రమాదాలను నివారించేందుకు మూలమలుపు వద్ద రోడ్డు వెడల్పు చేసి, గ్రామ ప్రజలు సంబంధిత అధికారులను కోరుతున్నారు. ఆలస్యం చేస్తే పెద్ద ప్రమాదం జరిగే అవకాశం ఉందని గ్రామ ప్రజలు కోరుతున్నారు.




## విజిట్ టు ద మ్యూజియం బస్సు ప్రారంభం

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**

ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 డేస్ యాక్షన్ ప్లాన్ లో భాగంగా ఈ నెల 23 వ తేదీ వరకు యువజన, క్రీడ, టూరిజం వారోత్సవాలు కొనసాగుతున్నాయి . ఇందులో భాగంగా విజిట్ టు ద మ్యూజియం ఎట్ కరీంనగర్ లో బాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని గీతానగర్ ఉన్నత పాఠశాల విద్యార్థులు తరలి వెళ్లే ఆర్ టీ సీ బస్ ను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి, జగన్ మోహన్ రెడ్డి, డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, జిల్లా యువజన, క్రీడల శాఖా అధికారి ఎ.రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ మట్టి రవాణాపై పోలీసుల ఉక్కుపాదం..

### - ఎస్పీ మహేష్ బి. గితే

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**



రాజన్న సిరిసిల్ల జిల్లాలో అనుమతి లేకుండా సాగుతున్న అక్రమ మట్టి తవ్వకాలు, రవాణాపై పోలీస్ యంత్రాంగం కొరడా ఝుళిపించింది. అక్రమ మట్టి తరలింపును అరికట్టేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నట్లు ఎస్పీ మహేష్ బి. గితే శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు . ఈ సంవత్సరంలో ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా అక్రమ మట్టి రవాణాకు సంబంధించి మొత్తం 19 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో భాగంగా నిబంధనలు ఉల్లంఘించిన 45 వాహనాలను సీజ్ చేశామని, అందులో 27 ట్రాక్టర్లు, 11 టిప్పర్లు, 7 జేసీబీలు ఉన్నాయని అన్నారు . జిల్లాలో ఎక్కడైనా మట్టిని తవ్వాలన్నా, నిల్వ చేయాలన్నా లేదా రవాణా చేయాలన్నా సంబంధిత ప్రభుత్వ శాఖల నుండి ముందస్తు అనుమతులు తప్పనిసరిగా పొందాలని, లేనిపక్షంలో చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

గడిచిన వారం రోజులుగా జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై వరుస దాడులు నిర్వహిస్తూ కఠినంగా వ్యవహరిస్తున్నామని హెచ్చరించారు. జిల్లా పరిధిలో ఎక్కడైనా అక్రమంగా మట్టి తవ్వకాలు జరిపినా, నిల్వ చేసినా లేదా తరలిస్తున్నా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, అక్రమార్కుల సమాచారాన్ని అందించి జిల్లా సంపదను కాపాడటంలో భాగస్వాములు కావాలని కోరారు.



## విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో కోళ్ల ఫారమ్ దగ్ధం...

### సుమారు రూ. 8 లక్షల ఆస్తి నష్టం...

**బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట**

ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామ శివారులో శుక్రవారం మధ్యాహ్నం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఒక కోళ్ల ఫారమ్ పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటనలో ఫారమ్‌లోని సామగ్రితో పాటు వందలాది కోళ్లు సజీవ దహనమయ్యాయి.అగ్రహారం గ్రామానికి చెందిన ఆంజనేయులు ఈ కోళ్ల ఫారమ్‌ను నిర్వహిస్తున్నారు. శుక్రవారం మధ్యాహ్నం ఒక్కసారిగా మంటలు చెలరేగి వేగంగా విస్తరించాయి. గమనించిన స్థానికులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు. అయితే, అప్పటికే ఫారమ్ పూర్తిగా కాలిపోవడంతో సుమారు రూ. 8 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు బాధితుడు ఆంజనేయులు కన్నీటి పర్యంతమయ్యారు.



## ఘనంగా భాగ్యరెడ్డి వర్మ జయంతి వేడుకలు..

### -నివాళులు అర్పించిన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**

శ్రీ భాగ్యరెడ్డి వర్మ జయంతి వేడుకలను జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో శుక్రవారం వేడుకలు నిర్వహించారు. ఎస్సీ సంక్షేమ శాఖ ఆద్వర్యంలో నిర్వహించగా, ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరై ముందుగా జ్యోతి ప్రజ్వలన చేశారు.ఈ సందర్భంగా భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.కార్యక్రమంలో ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి రవీందర్ రెడ్డి, జిల్లా అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# దేశానికే దిక్సూచిగా తెలంగాణ పథకాలు..

**-అన్ని వర్గాల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం**
**ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**
**- సిరిసిల్లలో వైభవంగా 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' జిల్లా స్థాయి సభ**
**- హాజరైన కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బీ గితె**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**



తెలంగాణ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు దేశానికే రోల్ మోడల్‌గా, దిక్సూచిగా నిలుస్తున్నాయని, సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు ప్రయోజనం చేకూర్చడమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యాచరణలో భాగంగా శుక్రవారం సిరిసిల్ల పట్టణ పరిధిలోని సాయి మణికంఠ ఫంక్షన్ హాల్ లో జిల్లా అధికార యంత్రాంగం ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సభను ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బీ గితె లతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి సభను ప్రారంభించారు. అనంతరం 'జయ జయహే తెలంగాణ' గీతాన్ని వినిపించి, సీఎం రేవంత్ రెడ్డి పంపిన సందేశాన్ని చదివి వినిపించారు. ఈ సందర్భంగా జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రత్యేక వీడియో ప్రదర్శనతో పాటు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అధికారులు అవగాహన కల్పించారు.అనంతరం లబ్ధిదారులకు ఇందిరా మహిళా శక్తి చీరలు, కళ్యాణ లక్ష్మి చెక్కులు, దివ్యాంగులకు బ్యాటరీ ఆపరేటెడ్ ట్రై సైకిళ్లు, ఎంపీడీఓ కార్యాలయాలకు కంప్యూటర్లు, ప్రింటర్లను అందజేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్రంలో గత 27 నెలలుగా ప్రజా పాలన దిగ్విజయంగా సాగుతోందని అన్నారు. గత మార్చి 6 నుంచి ప్రారంభమైన ప్రగతి ప్రణాళిక ద్వారా ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ, భవిష్యత్ ప్రణాళికల్లో వారిని భాగస్వాములను చేస్తున్నట్లు తెలిపారు. తెలంగాణలో అమలు అవుతున్న 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలను తమిళనాడు, కేరళ వంటి ఇతర రాష్ట్రాలు కూడా ఆదర్శంగా తీసుకుంటున్నాయని అన్నారు .

రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ.. ఎస్సీ వర్గీకరణ, బీసీ జనగణన పూర్తి చేశామని, రైతు రుణమాఫీ, రైతు భరోసా, మహిళలకు వడ్డీ లేని రుణాలు, సన్న బియ్యం పంపిణీ వంటి పథకాలను నిరంతరాయంగా అందిస్తున్నామని అన్నారు . ప్రపంచంలోనే ఎక్కడా లేని విధంగా త్వరలోనే 'ఇందిరమ్మ భీమా' పథకాన్ని తీసుకురాబోతున్నమని అన్నారు ?సిరిసిల్ల వస్త్ర పరిశ్రమను ఆదుకునేందుకు కోటి ఇందిరా మహిళా శక్తి చీరల ఉత్పత్తి ఆర్డర్ ఇచ్చామని, మొదట నీలి రంగు, ఇప్పుడు ఆకుపచ్చ రంగు చీరల ఆర్డర్లు ఇవ్వడం ద్వారా కార్మికులకు 6 నుండి 7 నెలల పాటు ఉపాధి లభిస్తుందని,అలాగే గత బకాయిలను కూడా ప్రభుత్వం పూర్తిగా చెల్లించిందన్నారు. వేములవాడ రాజన్న ఆలయ విస్తరణ, బద్దిపోచమ్మ ఆలయ అభివృద్ధి పనుల కోసం రూ.150 కోట్లు కేటాయించామని, మరో వెయ్యి ఏళ్ల పాటు నిలిచేలా ఆలయాన్ని తీర్చిదిద్దుతున్నామని అన్నారు . రూ.200 కోట్లతో 20 ఎకరాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మిస్తున్నామని, నియోజకవర్గానికి ఒక పబ్లిక్ స్కూల్ చొప్పున ఏర్పాటు చేసి నాణ్యమైన విద్యనందిస్తామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఆసుపత్రుల్లో 36 వేల బెడ్స్ అందుబాటులోకి రానున్నాయని, విద్యుత్ లో వోల్టేజ్ సమస్యల పరిష్కారానికి కొత్త సబ్‌స్టేషన్లను నిర్మిస్తున్నామని అన్నారు

**అభివృద్ధిలో జిల్లా ముందంజ: కలెక్టర్ గరిమ అగ్రవాల్**

జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పూర్తిలో రాష్ట్రంలోనే సిరిసిల్ల జిల్లా రెండో స్థానంలో నిలిచిందని హర్షం వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో ప్రభుత్వం ద్వారా అల్పాహార పథకం, కుటుంబ జీవిత బీమా, ఇంటర్ వరకు మధ్యాహ్న భోజనం, దివ్యాంగ విద్యార్థులకు వాహనాలు, సేంద్రియ వ్యవసాయ ప్రోత్సాహక పథకాలను త్వరలోనే ప్రారంభించనున్నట్లు తెలిపారు

**రోడ్డు భద్రతపై పోలీస్ శాఖ ప్రత్యేక దృష్టి: ఎస్పీ మహేష్ బి గితే**

జిల్లా ఎస్పీ మహేష్ బి గితే మాట్లాడుతూ, ప్రగతి ప్రణాళికలో భాగంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ట్రాఫిక్ నిబంధనల అవగాహన సదస్సుల వల్ల జిల్లాలో రోడ్డు ప్రమాదాలు తగ్గాయని తెలిపారు. ప్రమాదాలకు కారణమవుతున్న డ్రంక్ అండ్ డ్రైవ్, రాంగ్ రూట్ డ్రైవింగ్‌లపై నిఘా ఉంచామని, డ్రైవర్లకు కంటి పరీక్షలు చేయించామని అన్నారు . జిల్లా కేంద్రంలో డీ-అడిక్షన్ కౌన్సెలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, గంజాయి నిర్మూలనకు కఠిన చర్యలు తీసుకుంటున్నామని అన్నారు . వేసవిలో పిల్లలపై తల్లిదండ్రులు నిఘా ఉంచాలని, సైబర్ నేరాలు జరిగితే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని కోరారు.. సభా ప్రాంగణంలో చేనేత జౌళి, మెప్మా, వ్యవసాయ, ఉద్యానవన, మత్స్య, మహిళా సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను విప్, కలెక్టర్, ఎస్పీ పరిశీలించారు.కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్లు పుల్కం రాజు, జిందం కళ, వైస్ చైర్మన్లు నరాల శేఖర్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, మార్కెట్ కమిటీ చైర్మన్లు స్వరూప, రాజు, సబేరా బేగం, విజయ, ఆత్మ వేములవాడ డివిజన్ చైర్మన్ ముకుంద రెడ్డి, ఆర్డీవోలు రాజేందర్ రెడ్డి, కే ఎస్ బీ కుమారి, డీఎస్పీ నాగేంద్రచారి, సీపీఓ శ్రీనివాసాచారి, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదాల నివారణకు పోలీసుల ముందస్తు చర్యలు..



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**

**- మలుపుల వద్ద సూచిక బోర్డుల ఏర్పాటు**

రోడ్డు ప్రమాదాల నివారణే ధ్యేయంగా కొనరావుపేట పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఎస్పీ ఆదేశాల మేరకు కొనరావుపేట మండలం నిజామాబాద్ గ్రామ పరిధిలోని ఎల్లమ్మ దేవాలయం సమీపంలో ఉన్న ప్రమాదకర మలుపు వద్ద వాహనదారులను అప్రమత్తం చేయడానికి హెచ్చరిక, సూచిక బోర్డులను ఏర్పాటు చేశారు. ?ఈ సందర్భంగా చందుర్తి సిఐ రవీందర్ మాట్లాడుతూ, గతంలో ఈ ఎల్లమ్మ దేవాలయం మలుపు ప్రాంతంలో పలు ప్రమాదాలు జరిగి ప్రాణనష్టం సంభవించిన ఘటనలు ఉన్నాయని అన్నారు . అందువల్ల వాహనదారులు ఈ మలుపు ప్రాంతంలో ప్రయాణించేటప్పుడు వేగాన్ని తగ్గించి, నెమ్మదిగా వెళ్తూ తప్పనిసరిగా ట్రాఫిక్ నియమాలను పాటించాలని అన్నారు .?ప్రజల ప్రాణ భద్రతే ముఖ్య లక్ష్యంగా తమ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇలాంటి ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి, భవిష్యత్తులో మరిన్ని జాగ్రత్త చర్యలు చేపడుతామని అన్నారు . ఈ కార్యక్రమంలో కొనరావుపేట ఎస్.ఐ ప్రశాంత్ రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# అప్రకటిత విద్యుత్ కోతల నుంచి ప్రజలను కాపాడండి

**ఎన్పీడీసీఎల్ డీఈకి టిఆర్ఎస్ వినతి**

**బలగం టీవీ ,ఎల్లారెడ్డిపేట**



వేసవికాలంతో జిల్లా ప్రజలు వేడికి ఇబ్బందులు ఎదుర్కొంటుండగా అప్రకటిత విద్యుత్ కోతలతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారని ఎల్లారెడ్డిపేట మండలంలో అధిక విద్యుత్ కోతలు జరుగుతున్నాయని శుక్రవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని టీజీ ఎన్పీడీసీఎల్ డిఈ అంజయ్యకు టిఆర్ఎస్ జిల్లా నాయకులు వినతి పత్రం సమర్పించారు. ఎన్పీడీసీఎల్ డిఇ అంజయ్య తప్పకుండా అప్రకటిత కోతలు లేకుండా చూస్తామని, ప్రజలకు విద్యుత్ ఇబ్బందులు లేకుండా చేసే బాధ్యత మాపై ఉందని ప్రజలకు సేవ చేయడానికి ముందుంటామని డిఈ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా టిఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ గత కొన్ని రోజుల నుండి జిల్లాలోని పలు మండలాల్లో విద్యుత్ కోతలతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రాత్రి వేళలో ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు పలు గ్రామాలలో కరెంటు తీసివేస్తుండడంతో చిన్నపిల్లలు, వృద్ధులు నిద్ర లేక ఆరు బయటనే గడపాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. సమయపాలన లేకుండా విద్యుత్ కోతలు ఉండడంతో ప్రజలు బేజారవుతున్నారని, తెలంగాణ రక్షణ సేన పార్టీ నుండి విద్యుత్ అధికారుల దృష్టికి, డిఈ అంజయ్య కు విద్యుత్ కోతలతో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని దృష్టికి తీసుకెళ్లగా అప్రకటిత కోతలు లేకుండా తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడం జరిగిందని అన్నారు. టిఆర్ఎస్ అధినేత కవితక్క ఆదేశాల మేరకు ప్రజా సమస్యల పరిష్కారం కోసం విద్యుత్ అధికారులను కలిసి విద్యుత్ సమస్యలపై వివరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు మజీద్, వర్ద సతీష్ కుమార్, కదిరే భాస్కర్ గౌడ్, సయ్యద్ జావిద్, ఆంజనేయులు, అశోక్, అంజన్న, దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

# పచ్చి రొట్టె విత్తనాలు అందుబాటులో..

**మండల వ్యవసాయ అధికారి ప్రణీత**

**బలగం టీవీ, బోయినిపల్లి;**

తెలంగాణ ప్రభుత్వం ఈ వానాకాలం కొరకు రైతులకి అవసరమైన పచ్చిరొట్ట విత్తనాలైన జీలుగలు 50 శాతం రాయితీపై పంపిణీ చేయనుంది. దీనిలో భాగంగా ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం. రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి, ప్రాథమిక సహకార సంఘం కోరేం, కెడిసిఎంఎస్ వెంకట్రావుపల్లి నందు జీలుగ విత్తన బ్యాగులు అందుబాటులో గలవు. ఈ విత్తనాలు 30 కిలోల బస్తా పూర్తి ధర 4905 రూపాయలు, 50 శాతం రాయితీ పోను రైతు ధర 2452.50 రూపాయలు.

జీలుగ విత్తనాలు చల్లి, పూత దశలో కలియదున్నడం వల్ల భూసారం పెంపొందించుకోవడం మరియు ఎకరానికి 8-10 టన్నుల పచ్చిరొట్ట తద్వారా 40-50 కిలోల నత్రజని నెలకీ అందుతుంది.రాయితీపై జీలుగ బస్తాలు ఈ రోజు నుండి పంపిణీ జరుగుతుంది. రైతులు తమ పట్టాదారు పాసుపుస్తకాలు తీసుకుని మీ యొక్క రైతువేధిక బోయినిపల్లి, కోదురుపాక, కోరేం, విలసాగర్ లలో మీ వ్యవసాయ విస్తీర్ణ అధికారులను సంప్రదించాలని మండల వ్యవసాయ అధికారి ప్రణీత పత్రికాముఖంగా రైతులను కోరారు.

# తరుగు, తేమ పేరుతో అక్రమ కోతలు ఆపండి..




**-ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి..**
**-బీజేపీ జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**

?కొన్ని చోట్ల 'తరుగు', 'తేమ' పేరుతో అన్యాయంగా కోతలు విధిస్తున్నారని, ఎటువంటి తరుగు తీయకుండా ధాన్యం కొనుగోలు చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో రైతులు ఎదుర్కొంటున్న ధాన్యం కొనుగోలు సమస్యలపై భారతీయ జనతా పార్టీ నాయకులు ఏఓ వినతిపత్రాన్ని సమర్పించారు.?ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో రైతులు ఎంతో కష్టపడి పండించిన వరి ధాన్యాన్ని విక్రయించేందుకు కొనుగోలు కేంద్రాలకు తీసుకువస్తున్నప్పటికీ, అక్కడ నెలకొన్న అవ్యవస్థల కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు.సరైన మౌలిక వసతుల లేమి, కొనుగోళ్లలో జరుగుతున్న జాప్యం రైతుల పాలిట శాపంగా మారాయని మండిపడ్డారు. జిల్లాలోని పలు కొనుగోలు కేంద్రాల్లో గన్నీ బ్యాగులు, కాంటాలు, హమాలీల కొరత వేధిస్తోందని, రవాణా సౌకర్యాల లోపం మరియు ధాన్యం నిల్వ చేసే స్థలాలు లేకపోవడం వల్ల రైతులు రోజుల తరబడి కేంద్రాల వద్దే పడిగాపులు కాయాల్సి వస్తోందని అన్నారు . దీనికి తోడు అకాల వర్షాల కారణంగా కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం తడిసి రైతులు తీవ్రంగా ఆర్థికంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లాలోని అన్ని కొనుగోలు కేంద్రాల్లో వెంటనే మౌలిక వసతులు కల్పించాలని, ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. గన్నీ బ్యాగులు, హమాలీలు, రవాణా సదుపాయాలను తక్షణమే అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. అలాగే కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన చెల్లింపులను రైతుల ఖాతాల్లో వెంటనే జమ చేయాలని, అకాల వర్షాల నుంచి ధాన్యాన్ని రక్షించే చర్యలు చేపట్టాలని అన్నారు . ఈ సమస్యలను ప్రభుత్వం అత్యవసరంగా పరిష్కరించాలని, లేనిపక్షంలో రైతుల పక్షాన భారతీయ జనతా పార్టీ మరింత తీవ్ర స్థాయిలో ఉద్యమాలు చేపట్టేందుకు వెనుకాడదని హెచ్చరించారు.?ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు లింగంపల్లి శంకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి పొన్నాల తిరుపతిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు శీలం రాజు, జిల్లా కార్యదర్శులు శ్రీమతి కర్నే హరీష రేవంత్, గొప్పడి సురేందర్రావు, నంద్యాడపు వెంకటేష్ పాల్గొన్నారు. అలాగే బీజేవైఎం జిల్లా అధ్యక్షులు రాగుల రాజిరెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు కొడిపల్లి గోపాల్ రెడ్డి, జిల్లా కోశాధికారి ఆసాని రామలింగారెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి బర్కం నవీన్ యాదవ్, సిరిసిల్ల పట్టణ అధ్యక్షులు దుమాల శ్రీకాంత్, బీజేపీ సీనియర్ నాయకులు అన్నాడి జలపతి రెడ్డి, రాజిరెడ్డి, గజ బింకర్ చందు తదితరులు పాల్గొన్నారు .

# రూ. కోట్లల్లో డిప్యూటి కలెక్టర్ ఆస్తులు..!

**అక్రమ ఆస్తులపై ఎసిబి సోదాలు**

**బలగం టీవి, హైదరాబాద్**

మేడ్చల్ – మల్కాజ్‌గిరి జిల్లా డిప్యూటీ కలెక్టర్‌గా గతంలో పని చేసిన వంశీ మోహన్ నివాసంలో ఏసీబీ అధికారులు శుక్రవారం సోదాలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల్లోని ఆయనకి సంబంధించిన 8 ఇళ్లపై ఏసీబీ అధికారులు ఏకకాలంలో దాడులు చేసి తనిఖీలు చేపట్టారు. ఈ దాడుల్లో వంశీ మోహన్‌కు సంబంధించి.. రూ.వందల కోట్ల ఆస్తులు ఉన్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. అతడిపై ఆదాయానికి మించిన ఆస్తుల కేసును అధికారులు నమోదు చేశారు. పెద్దఎత్తున ప్రభుత్వ ఆస్తులు కాజేసినట్లు వంశీ మోహన్‌పై ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో ఏసీబీ అధికారులు ఈ సోదాలు నిర్వహించారు. శేరిలింగంపల్లితో పాటు పలు ప్రాంతాల్లో వంశీ మోహన్ ఆర్డీవోగా పనిచేశారు. అలాగే అబ్దుల్లాపూర్ మెట్, పిగ్లీపురంలో 8 ఎకరాల భూమిని ఆయన కాజేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. సదరు భూమిని తన మామ పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించి.. దానిని రియల్టర్‌కు కట్టబెట్టినట్లు విమర్శలు వచ్చాయి. ఒక ఓ రియల్టర్ నుంచి 10 ప్లాట్లు గిఫ్ట్ డీడ్‌ను వంశీ మోహన్ తీసుకున్నట్లు కూడా ఈ సోదాల్లో ఏసీబీ గుర్తించినట్లు తెలుస్తుంది. ఈ ఆదాయానికి మించిన ఆస్తుల వ్యవహారంలో వంశీ మోహన్‌ను ఏసీబీ అధికారులు విచారిస్తున్నారు.

# జూలై నుంచే అందుబాటులోకి భోగాపురం



అక్కడి నుంచే విమాన సర్వీసుల రాకపోకలు

**బలగం టీవి, అమరావతి**

జులై 8వ తేదీ నుంచి భోగాపురంలోని అల్లూరి సీతారామరాజు విమానాశ్రయం అందుబాటులోకి రానుంది. జులై 5వ తేదీన ప్రధాని నరేంద్ర మోదీ భోగాపురం విమానాశ్రయాన్ని ప్రారంభించే అవకాశం ఉంది. జులై 8వ తేదీ నుంచి తమ విమానాలన్నీ భోగాపురం నుంచే నడుస్తాయని పలు విమానయాన సంస్థలు ఇప్పటికే ప్రకటించాయి. జులై 8వ తేదీ నుంచి అల్లూరి సీతారామరాజు విమానాశ్రయానికి రావాలని ఇప్పటికే తమ ప్రయాణికులకు సర్క్యులర్లు జారీ చేశాయి. 2026 జులై 8వ తేదీ నుంచి స్పూట్ ఎయిర్‌లైన్స్‌కు సంబంధించిన అన్ని విమానాలు విశాఖపట్నం విమానాశ్రయం నుంచి కాకుండా.. కొత్తగా నిర్మించిన అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి నడుస్తాయని స్పూట్ ఎయిర్‌లైన్స్ సర్క్యులర్ జారీ చేసింది. విమానాశ్రయం మారినప్పటికీ, ఎయిర్‌పోర్ట్ కోడ్ 'క్ష్మిజి' గానే

కొనసాగుతుందని తెలిపింది. చెక్–ఇన్ కౌంటర్లు, స్పూట్ ఎయిర్‌లైన్స్ కౌంటర్లు కొత్త విమానాశ్రయంలోని టెర్మినల్ 1 లోపల ఉంటాయని విమానయాన సంస్థ వెల్లడించింది. విమానం బయలుదేరే సమయానికి 2.5 గంటల (150 నిమిషాలు) ముందే చెక్–ఇన్ కౌంటర్లు తెరవబడతాయని తెలిపింది. అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం (భోగాపురం) విశాఖపట్నం సిటీ సెంటర్ నుంచి సుమారు 50 కిలోమీటర్ల దూరంలో ఉంది. ప్రయాణికులు ఎలాంటి ఆలస్యం లేకుండా చెక్–ఇన్ ప్రక్రియలను పూర్తి చేసుకోవడానికి.. విమానం టైం కంటే కనీసం 120 నిమిషాల ముందే ఎయిర్‌పోర్ట్‌కు చేరుకోవాలని స్పూట్ ఎయిర్ లైన్స్ సంస్థ సూచించింది.

## రాయలసీమలో 'సౌర' విప్లవం..

# రికార్డు కాలంలో మెగా ప్రాజెక్టు పూర్తి!

**రూ.3వేల కోట్లతో 600 మెగావాట్ల సోలార్ ప్లాంట్ ప్రారంభం**

**జమ్మలమడుగులో అంకితం చేసిన మంత్రి నారా లోకేష్**

**ఆంధ్రప్రదేశ్ అంటేనే 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్': సీఎం చంద్రబాబు హర్షం**

**బలగం టీవి, అమరావతి**

ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక, ఇంధన రంగాల్లో మరో చారిత్రాత్మక మైలురాయి నమోదైంది. కడప జిల్లా జమ్మలమడుగు నియోజకవర్గం, కొండాపురం మండలం టి.కొండూరు గ్రామంలో రూ.3,000 కోట్ల భారీ పెట్టుబడితో నిర్మించిన 'సుఖ్ బీర్ ఆగ్రో ఎనర్జీ లిమిటెడ్' (రాజుజూ) 600 మెగావాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్టును రాష్ట్ర ఐటీ, పారిశ్రామిక శాఖ మంత్రి నారా లోకేష్ ఘనంగా ప్రారంభించి, ప్రజలకు అంకితం చేశారు. కేవలం 11 నెలల రికార్డు సమయంలోనే ఈ మెగా ప్రాజెక్టును పూర్తి చేయడం విశేషం.

**సుస్థిర భవిష్యత్తుకు నిదర్శనం: ముఖ్యమంత్రి**

ఈ మెగా సోలార్ ప్రాజెక్టు విజయవంతంగా ప్రారంభం కావడంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ హర్షం వ్యక్తం చేశారు. "వ్యాపార నిర్వహణ వేగం (స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్), కార్యనిర్వహణ వేగం (స్పీడ్ ఆఫ్ ఎగ్జిక్యూషన్) రెండూ కలిసిన ప్రదేశం ఆంధ్రప్రదేశ్ అని చెప్పడానికి నేను ఎంతో గర్వపడుతున్నాను" అని సీఎం పేర్కొన్నారు. రాయలసీమ ప్రాంతంలో సుఖ్ బీర్ ఆగ్రో ఎనర్జీ సంస్థ నిర్మించిన ఈ 600 మెగావాట్ల సోలార్ ప్రాజెక్టు రాష్ట్ర సుస్థిర భవిష్యత్తు పట్ల తమ ప్రభుత్వానికి ఉన్న తిరుగులేని నిబద్ధతకు నిదర్శనమని చంద్రబాబు స్పష్టం చేశారు. భారతదేశ స్వచ్ఛ ఇంధన ప్రయాణంలో ఆంధ్రప్రదేశ్‌ను అగ్రగామిగా నిలబెడుతున్న ఇలాంటి ప్రాజెక్టులు రాష్ట్రానికి ఎంతో గర్వకారణమని ఆయన కొనియాడారు.



**ఉద్యోగాలు, కొత్త అవకాశాలు:**

ఇంత తక్కువ సమయంలో, రికార్డు కాలంలో ప్రాజెక్టును పూర్తి చేసిన 'ఎస్ఏఈఎల్ ఇండియా' బృందానికి ముఖ్యమంత్రి తన హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. ఈ మెగా సౌర విద్యుత్ కేంద్రం ద్వారా రాయలసీమ ప్రాంత ప్రజలకు పెద్ద ఎత్తున ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయని, ఈ ప్రాజెక్టు ప్రాంతీయ అభివృద్ధికి, కొత్త పెట్టుబడులకు బాటలు వేస్తుందని చంద్రబాబు ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఆస్కార్ స్థాయి నటుడు జగన్



**తల్లిని, చెల్లిని గెంటేసిన మహానుభావుడు**

**రాజకీయం కోసం కుట్రలు, నాటకాలు అలవాటు**

**మంత్రి లోకేశ్ ఘాటు విమర్శలు**

**బలగం టీవి, అమరావతి**

మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అద్భుత నటుడని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. సినిమాల్లో నటిస్తే జగన్‌కు కచ్చితంగా ఆస్కార్ అవార్డ్ వస్తుందని ఎద్దేవా చేశారు. ఆస్తి కోసం సొంత తల్లి, చెల్లిని బయటకు గెంటేశారని.. ఇంకో చెల్లి తండ్రిని చంపి అన్యాయం చేశారంటూ మంత్రి ఆరోపించారు. సొంత జిల్లా ప్రజలను మోసం చేశారని.. సొంత బాబాయిని లేపేసి నెపం టీడీపీపై నెట్టారని మండిపడ్డారు. వైఎస్ఆర్ కడప జిల్లా జమ్మలమడుగు నియోజకవర్గ టీడీపీ కార్యకర్తలు, నేతలతో లోకేశ్ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. వైఎస్ వివేకాది గుండెపోటు కాదని.. గొడ్డలి పోటు అంటూ ఆరోపణలు గుప్పించారు. గతంలో జగన్ కోడికత్తి, గులకరాయి డ్రామాలు చూశామని.. మొన్న కడపలోనూ అలాంటి కుట్రే జరిగిందన్నారు. మతాల మధ్య చిచ్చుపెట్టాలని చూశారని.. తప్పు చేసిన ఎవరినీ వదిలిపెట్టేది లేదని మంత్రి లోకేశ్ హెచ్చరించారు. రప్పా, రప్పా అంటే భయపడేవారు ఎవరూ లేరని.. మీ నాయకుడిని, వారి తండ్రినీ చూశామని వైసీపీ కార్యకర్తలకు చురకలు అంటించారు. ప్పా, రప్పాకు ఎండ్ కార్డ్ వేసే బాధ్యత తనదంటూ మంత్రి లోకేశ్ తేల్చి చెప్పారు. రెడ్ బుక్ అంటేనే భయపడుతున్నారని.. చివరకు ఎర్ర కారు చూసినా బెదిరిపోతున్నారని వైసీపీ నేతలపై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. జగన్ రెడ్డి వారంలో ఒక రోజు మాత్రమే ఏపీలో ఉంటున్నారని.. మూడు రోజులు బెంగళూరులో, మరో మూడు రోజులు హైదరాబాద్‌లో ఉంటున్నారని లోకేశ్ తెలిపారు. జగన్‌కు సీసీడీ (క్రెడిట్ చోరీ డిజార్డర్) వ్యాధి ఉందని.. వైసీపీ కుట్రలపై అందరూ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. సందర్భంగా గండికోట నిర్వాసితులకు న్యాయం చేస్తామని మంత్రి లోకేశ్ హామీ ఇచ్చారు. రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దుతామని భరోసా ఇచ్చారు. రాబోయే రోజుల్లో జమ్మలమడుగుకు అనేక పరిశ్రమలు వస్తాయని తెలిపారు. రాయలసీమ స్టీల్ ఎక్మి–లాంట్‌ను 2029 నాటికి పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. కష్టకాలంలో పసుపుజెండాకు అండగా నిలబడిన వ్యక్తి భూపేశ్ రెడ్డి అని మంత్రి ప్రశంసించారు. ఆయనకు మాటలు తక్కువ.. చేతలు ఎక్కువని కొనియాడారు. జమ్మలమడుగు జోష్ అదిరిపోయిందని.. గండికోటను, టీడీపీని ఎవరూ టచ్ చేయలేరని మంత్రి లోకేశ్ తేల్చి చెప్పారు.

## 'కాక్రోచ్ జనతా పార్టీ' మద్దతుదారులకు కర్ణాటక పోలీసుల హెచ్చరిక

**బలగం టీవి, బెంగళూరు**

'కాక్రోచ్ జనతా పార్టీ' పేరుతో సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతున్న మానవహారం కార్యక్రమంపై కర్ణాటక పోలీసులు హెచ్చరిక జారీ చేశారు. మే 24న బెంగళూరులోని టౌన్ హాల్ వద్ద నిర్వహించ నున్నట్లు ప్రచారం జరుగుతున్న శాంతియుత మానవహారంలో ప్రజలు పాల్గొనవద్దని, దానికి సంబంధించిన సందేశాలను సోషల్ మీడియాలో షేర్ చేయవద్దని పోలీసులు స్పష్టం చేశారు.'కాక్రోచ్ జనతా పార్టీ, కర్ణాటక' పేరుతో సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న పోస్టుల్లో మే 24 ఉదయం 11 గంటలకు టౌన్ హాల్ ముందు పెద్ద ఎత్తున గుమికూడాలని పిలుపునిచ్చారు. అయితే ఈ కార్యక్రమానికి సంబంధించి ఎలాంటి అనుమతి కోరలేదని, పోలీసులు గానీ, బీబీఎంపీ అధికారులు గానీ అనుమతి మంజూరు చేయలేదని బెంగళూరు పోలీసులు వెల్లడించారు.

కర్ణాటక హైకోర్టు 2022 ఆగస్టు 1న జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం ఫ్రీడమ్ పార్క్ మినహా ఇతర ప్రాంతాల్లో నిరసనలు, ర్యాలీలు, ధర్నాలకు అనుమతి లేదని తెలిపారు. టౌన్ హాల్ వద్ద గుమికూడటం కోర్టు ఆదేశాల ఉల్లంఘనగా పరిగణించబడుతుందని హెచ్చరించారు. ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్ వంటి సోషల్ మీడియా వేదికల ద్వారా ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టులు, సందేశాలను ఫార్వర్డ్ చేయవద్దని ప్రజలకు సూచించారు. చట్టవ్యతిరేకంగా గుమికూడితే చర్యలు తప్పవని పోలీసులు స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా, 'కాక్రోచ్ జనతా పార్టీ' పేరుతో ఆన్‌లైన్‌లో ప్రచారం చేస్తున్న వర్గాలు తమ బలాన్ని వీధుల్లో ప్రదర్శించాలని మద్దతుదారులకు పిలుపునిస్తున్నాయి. అయితే ఈ సంస్థ స్వరూపం, లక్ష్యాలపై ఇంకా స్పష్టత రాలేదు.

# రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

**బలగం టీవి, న్యూఢిల్లీ**



రిజర్వేషన్ల అంశంపై సుప్రీంకోర్టు శుక్రవారం కీలక వ్యాఖ్యలు చేసింది. వెనుకబడిన తరగతుల్లోని ఆర్థికంగా, విద్యాపరంగా అభివృద్ధి చెందిన కుటుంబాల పిల్లలకు రిజర్వేషన్ ప్రయోజనాలు కొనసాగించాల్సిన అవసరం ఏమిటని ప్రశ్నించింది. తల్లిదండ్రులిద్దరూ ఐఏఎస్ అధికారులు అయిన కుటుంబాలకు కూడా రిజర్వేషన్లు వర్తించాలా? అంటూ ధర్మాసనం అభ్యంతరం వ్యక్తం చేసింది.

జస్టిస్ బి.వి. నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌లతో కూడిన ధర్మాసనం క్రీమీ లేయర్‌కు సంబంధించిన పిటిషన్‌పై విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా జస్టిస్ నాగరత్న మాట్లాడుతూ.. "తల్లిదండ్రులిద్దరూ ఐఏఎస్‌లు అయితే వారు ఇప్పటికే సమాజంలో ఉన్నత స్థితికి చేరుకున్నట్టే. అలాంటి కుటుంబాల పిల్లలకు కూడా రిజర్వేషన్లు కొనసాగించాలని కోరడం సమంజసం కాదు. ప్రభుత్వం ఇందుకు సంబంధించి మినహాయింపులు ఇచ్చినా వాటినే ఇప్పుడు సవాలు చేస్తున్నారు" అని వ్యాఖ్యానించారు. "విద్యా, ఆర్థికంగా ఉన్నత స్థితికి చేరుకున్నవారు మళ్లీ తమ పిల్లలకు కూడా రిజర్వేషన్లు కోరుతున్నారు. ఇది ఇలాగే కొనసాగితే రిజర్వేషన్ల వ్యవస్థ నుంచి సమాజం ఎప్పటికీ బయటపడలేదు. తల్లిదండ్రుల సామాజిక, ఆర్థిక స్థితి మారిన తర్వాత పిల్లల పరిస్థితి కూడా మారుతుంది. కాబట్టి రిజర్వేషన్ల అమలులో సమతుల్యత అవసరం" అని ధర్మాసనం పేర్కొంది. రిజర్వేషన్ల ద్వారా లబ్ధి పొంది సామాజిక, ఆర్థికంగా సాధికారత సాధించిన కుటుంబాలు తమ తర్వాతి తరానికి అదే ప్రయోజనాలు అవసరమా అనే అంశంపై పునఃపరిశీలన చేసుకోవాలని సుప్రీంకోర్టు సూచించింది. ఉన్నత స్థితికి చేరుకున్న కుటుంబాలు పదేపదే రిజర్వేషన్ ప్రయోజనాలు పొందడంపై ఆందోళన వ్యక్తం చేసింది.

అయితే పిటిషనర్ తరఫున హాజరైన న్యాయవాది రత్నూ వాదిస్తూ.. క్రీమీ లేయర్‌ను నిర్ణయించడంలో కేవలం జీతం లేదా ఆదాయం మాత్రమే ప్రమాణం కాదన్నారు. తల్లిదండ్రుల హోదా, వారు ఏ సేవలో ఉన్నారు అన్నదే ముఖ్యమని తెలిపారు. జీతాన్నే ఏకైక ప్రమాణంగా తీసుకుంటే డ్రైవర్లు, క్లర్కులు, ప్యూన్లు వంటి తక్కువ స్థాయి ప్రభుత్వ ఉద్యోగులు కూడా రిజర్వేషన్ ప్రయోజనాలు కోల్పోయే పరిస్థితి వస్తుందని ఆయన వాదించారు.



## తిరుమలలో భక్తుల రద్దీ

**అభిషేక సేవలో సామాన్యులకు దర్శనం**

**బలగం టీవి, తిరుమల**

తిరుమలలో రద్దీ కారణంగా సామాన్య భక్తులకు ప్రాధాన్యత ఇచ్చేందుకు టైం మేనేజ్‌మెంట్‌పై దృష్టి సారించినట్లు అదనపు ఈవో వెంకయ్య చౌదరి తెలిపారు. గురువారం రికార్డు స్థాయిలో 79 వేల మంది భక్తులకు దర్శన భాగ్యం కల్పించినట్లు ఆయన చెప్పారు. శుక్రవారం అభిషేక సేవ సమయంలో సామాన్య భక్తులను దర్శనానికి అనుమతించామన్నారు. అభిషేక సేవ సమయంలో 5850 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారన్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా తితిదే కీలక నిర్ణయం తీసుకుంది. శ్రీవారి అభిషేక సేవ సమయంలో సామాన్య భక్తులను శ్రీవారి దర్శనానికి అనుమతించింది. గతేడాది వేసవిలోనూ అభిషేక సమయంలో భక్తులకు స్వామివారి దర్శనభాగ్యం కల్పించింది.

## అర్చక తండ్రీ కుమారుల ఆత్మహత్య

**బలగం టీవి, జనగామ**

జనగామ జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. అర్చకులుగా పనిచేస్తున్న తండ్రీకుమారులు ఆత్మహత్య చేసుకున్నారు. గణపురం మండలం బండగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో అర్చకులుగా విధులు నిర్వహించే వరయోరు లక్ష్మీనరసింహాచార్యులు, ఆయన కుమారుడు పవన్‌కుమార్ ఆచార్యులు బలవన్మరణానికి పాల్పడినట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు. ఆలయ కోనేరులో పడి మృతిచెందినట్లు చెప్పారు. లక్ష్మీనరసింహాచార్యుల భార్య శ్రీదేవి నెల క్రితం అనారోగ్యంతో చనిపోవడం, ఆర్థిక ఇబ్బందులు తదితర కారణాలతో తండ్రీకుమారులు ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. ఘటనాస్థలాన్ని పరిశీలించారు. ఎస్సై శ్రావణ్‌కుమార్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అరటితోట దగ్ధం

**బలగం టీవి, జయశంకర్ భూపాలపల్లి**

చిట్యాల మండలం రామచంద్రాపురంలో అగ్ని ప్రమాదం సంభవించింది. 11కెవి విద్యుత్ వైర్లు తగిలి షార్ట్ సర్క్యూట్‌తో అరటి తోటలో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. క్షణాల్లోనే మంటలు వ్యాపించి పంట మొత్తం దగ్ధమైంది. అగ్ని ప్రమాదం రైతు కుటుంబాన్ని రోడ్డున పడేసింది. ?సిరిపురం కుమారస్వామి అనే రైతుకు చెందిన 4 ఎకరాల అరటి తోట అగ్నికి ఆహుతైంది. దాదాపు రూ.10 లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. చేతికి వచ్చే దశలో ఉన్న పంట కాలిపోవడంతో రైతు కన్నీరుమున్నీరవుతున్న పరిస్థితి. అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన తనను ప్రభుత్వం ఆదుకోవాలని రైతు వేడుకుంటున్నాడు.



## కేసీఆర్‌ను వివాహానికి ఆహ్వానించిన బోయినపల్లి వినోద్ కుమార్

**చిన్న కుమారుడు ప్రణయ్ పెళ్లి పత్రిక అందజేత**

**జూన్ 25న జన్వాడ వేదికగా వివాహం**


**బలగం టీవి, హైదరాబాద్**

బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ తమ చిన్న కుమారుడు ప్రణయ్ వివాహానికి పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు (కేసీఆర్)ను సాదరంగా ఆహ్వానించారు. శుక్రవారం నాడు వినోద్ కుమార్ తన సతీమణి మాధవితో కలిసి ఎర్రవల్లిలోని కేసీఆర్ నివాసానికి వెళ్లారు.ఈ సందర్భంగా కేసీఆర్ – శోభ దంపతులకు వినోద్ కుమార్ దంపతులు తమ కుమారుడి వివాహ పత్రికను అందజేసి, నూతన వధూవరులను ఆశీర్వదించేందుకు తప్పక విచ్చేయాలని కోరారు. డాక్టర్ రీతికతో ప్రణయ్ వివాహం జూన్ 25వ తేదీ (గురువారం) ఉదయం 7.41 గంటలకు జన్వాడలోని 'కే. కన్వెన్షన్' వేదికగా వైభవంగా జరుగనుంది.

## జూన్ 14న సింగపూర్‌కు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్

**బలగం టీవి, హైదరాబాద్**

ఆంధ్రప్రదేశ్‌కు భారీ పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ వచ్చే నెలలో సింగపూర్ పర్యటనకు వెళ్లనున్నారు. సింగపూర్ ప్రభుత్వ ఆహ్వానం మేరకు జూన్ 14 నుంచి 16 వరకు మూడు రోజుల పాటు ఈ పర్యటన జరగనుంది. సింగపూర్‌లో నిర్వహించే ప్రతిష్ఠాత్మక 'వరల్డ్ సిటీస్ సమ్మిట్'లో సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ పాల్గొననున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి పెట్టుబడులు రప్పించేందుకు పారిశ్రామికవేత్తలు, అంతర్జాతీయ వ్యాపార సంస్థల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించనున్నారు. రాష్ట్రంలో పెట్టుబడులకు అనుకూల వాతావరణం, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు, మౌలిక వసతుల అభివృద్ధి వంటి అంశాలను వారికి వివరించనున్నట్లు సమాచారం. ముఖ్యంగా ఐటీ, పారిశ్రామిక, మౌలిక వసతులు, పట్టణాభివృద్ధి రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించడంపై దృష్టి సారించనున్నారు.



## 'హర్మూజ్'పై ఇరాన్ టోల్ బాదుడు.. అమెరికా తీవ్ర అభ్యంతరం!

**అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధమన్న యూఎస్ విదేశాంగ మంత్రి మార్కో రుబియో**

**శాంతి చర్చలు మరింత సంక్లిష్టం అవుతాయని హెచ్చరిక**

**నౌకల నుంచి వసూళ్లు ప్రారంభమైనట్లు ఇరాన్ మీడియా వెల్లడి**

**బలగం టీవి, వాషింగ్టన్**

అంతర్జాతీయ నౌకా రవాణాకు అత్యంత కీలకమైన 'హర్మూజ్ జలసంధి' వద్ద ఇరాన్ టోల్ వసూలు చేయాలని యోచిస్తుండటంపై అమెరికా తీవ్రంగా స్పందించింది. ఇరాన్ చేపట్టే ఇటువంటి ఏకపక్ష టోల్ వసూలు చర్యలను ప్రపంచంలోని ఏ దేశం కూడా అంగీకరించకూడదని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో స్పష్టం చేశారు. ఈ రకమైన వసూళ్లు అంతర్జాతీయ చట్టాలకు పూర్తిగా విరుద్ధమని ఆయన పేర్కొన్నారు. అంతర్జాతీయ నౌకా రవాణా మార్గాల్లో రాకపోకలను నియంత్రించే లేదా శాసించే హక్కు ఏ ఒక్క దేశానికి లేదని రుబియో తేల్చిచెప్పారు.

**శాంతి చర్చలకు భంగం:**

హర్మూజ్ జలసంధి గుండా సాగే స్వేచ్ఛాయుత నౌకాయానానికి ఎవరూ భంగం కలిగించలేరని అమెరికా విదేశాంగ మంత్రి వ్యాఖ్యానించారు. ఒకవేళ ఇరాన్ పట్టుబట్టి టోల్ వసూలు చేయాలని నిర్ణయిస్తే, అది ఇరు దేశాల మధ్య ప్రస్తుతం జరుగుతున్న శాంతి చర్చలను మరింత సంక్లిష్టం చేసినట్లే అవుతుందని ఆయన హెచ్చరించారు.

**నష్టాల భర్తీ కోసమేనా?**

మరోవైపు, హర్మూజ్ జలసంధిని దాటే అంతర్జాతీయ నౌకల నుంచి అప్పుడే పెద్ద మొత్తంలో టోల్ వసూలు చేయడం ప్రారంభమైందని ఇరాన్ అధికారిక మీడియా వెల్లడించింది. ఈ కొత్త నిబంధనల ప్రకారం.. ఆ మార్గంలో ప్రయాణించే నౌకల యజమానులు, అందులో ఉన్న సరకు వివరాలు, అవి చేరుకోవాల్సిన గమ్యస్థానాల గురించిన పూర్తి సమాచారాన్ని ఇరాన్ అధికారులకు ముందే సమర్పించాల్సి ఉంటుంది. అమెరికాతో జరిగిన యుద్ధం కారణంగా తమకు వాటిల్లిన ఆర్థిక నష్టాన్ని ఈ టోల్ ద్వారా కొంతవరకు పూడ్చుకోవాలని, అలాగే హర్మూజ్‌పై పూర్తి నియంత్రణ సాధించాలని ఇరాన్ భావిస్తున్నట్లు అక్కడి మీడియా పేర్కొంది. అయితే, ఈ టోల్ విధింపుపై ఇరాన్ ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడకపోవడం గమనార్హం.




# ఐపీఎల్‌కు విజయ్ శంకర్ టాటా

బలగం టీవీ, హైదరాబాద్

టీమిండియా మాజీ ఆల్‌రౌండర్ విజయ్ శంకర్ కీలక నిర్ణయం తీసుకున్నాడు. దేశీయ క్రికెట్‌తో పాటు ఐపీఎల్‌కు కూడా వీడ్కోలు పలుకుతున్నట్లు శుక్రవారం అధికారికంగా ప్రకటించాడు. ఇన్నాళ్లు తనకు మద్దతుగా నిలిచిన బీసీసీఐ, ఫ్యాన్స్, భారత క్రికెట్ జట్టుకు ధన్యవాదాలు తెలిపాడు. కొత్త అవకాశాలను అందిపుచ్చుకోవాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించాడు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టాడు. 'క్రికెటే నా జీవితం. పదేళ్ల వయసులో మొదలైన క్రికెట్ ప్రయాణం 25 ఏళ్ల తర్వాత ఈ స్థాయికి చేరింది. టీమిండియాలో ఆడే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నాను. భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించడం నా జీవితంలోనే అత్యంత గర్వకారణమైన క్షణం' అని పేర్కొన్నాడు. దేశవాళీ క్రికెట్‌లో తమిళనాడు తరఫున విజయ్ శంకర్ అద్భుత ప్రదర్శన చేశాడు. మిడిలార్డర్‌లో బ్యాటింగ్‌తో పాటు, మీడియం పేస్ బౌలింగ్‌తో జట్టుకు ఎన్నో విజయాలు అందించాడు. ఈ నిలకడైన ఆటతీరే అతడికి జాతీయ జట్టులో చోటు సంపాదించి పెట్టింది. 2018లో శ్రీలంకలో జరిగిన నిదహాస్ ట్రోఫీ ద్వారా అంతర్జాతీయ టీ20ల్లోకి అరంగేట్రం చేసిన శంకర్.. ఆ తర్వాత వన్డేల్లోనూ భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. విజయ్ శంకర్ తన క్రికెట్ కెరీర్‌లో 12 వన్డేలు, 9 టీ20 మ్యాచ్‌ల్లో ప్రాతినిధ్యం వహించాడు.

విజయ్ శంకర్ కెరీర్‌లో అత్యంత కీలకమైన ఘట్టం 2019 వన్డే ప్రపంచ కప్. అప్పట్లో అద్భుతమైన ఫామ్‌లో ఉన్న అంబటి రాయుడును పక్కన పెట్టి మరీ సెలక్టర్లు విజయ్ శంకర్‌ను ప్రపంచ కప్ జట్టులోకి ఎంపిక చేశారు. ఆ సమయంలో చీఫ్ సెలక్టర్ ఎంఎస్‌కే ప్రసాద్.. అతడిని 'త్రీ డైమెన్షనల్' ప్లేయర్‌గా అభివర్ణించాడు. అప్పట్లో ఆ మాట క్రీడా వర్గాల్లో పెద్ద సంచలనంగా మారింది. ఆ టోర్నీలో విజయ్ పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో వేసిన తొలి బంతికే వికెట్ తీసి రికార్డు సృష్టించాడు. అయితే ఆ తర్వాత కాలి వేలి గాయం కారణంగా టోర్నీ మధ్యలోనే నిష్క్రమించాల్సి వచ్చింది. ఆ తర్వాత జాతీయ జట్టులోనూ చోటు కోల్పోయాడు. ఐపీఎల్‌లో విజయ్ శంకర్ చెన్నై సూపర్ కింగ్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్, ఢిల్లీ క్యాపిటల్స్, గుజరాత్ టైటాన్స్ జట్లకు ప్రాతినిధ్యం వహించాడు. ముఖ్యంగా గుజరాత్ టైటాన్స్ జట్టు టైటిల్ గెలవడంలో, తర్వాతి సీజన్‌లో రన్నరప్‌గా నిలవడంలో విజయ్ శంకర్ కీలక పాత్ర పోషించాడు. ఆఖరిగా సీఎస్కే తరఫున ప్రాతినిధ్యం వహించాడు. కాగా ఈ సీజన్‌లో అతడిని ఎవరూ కొనుగోలు చేయలేదు. దేశీయ క్రికెట్‌లో కూడా విజయ్ శంకర్ ప్రదర్శన ఆకట్టుకునేలా సాగింది. 77 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌ల్లో 4,253 పరుగులు, 13 సెంచరీలు నమోదు చేయడంతో పాటు 43 వికెట్లు పడగొట్టాడు. లిస్ట్-ఏ, టీ20 ఫార్మాట్లలోనూ బ్యాట్, బంతితో తన ముద్ర వేశాడు. ఇప్పుడు అతని కొత్త ప్రయాణం ఎలా ఉండబోతోందో చూడాల్సి ఉంది.



# ఉప్పల్‌లో 'సన్‌రైజర్స్' పరుగుల విధ్వంసం

బలగం టీవీ, హైదరాబాద్

ఐపీఎల్ 2026 సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ బ్యాటర్లు మరోసారి ఉప్పల్ స్టేడియం వేదికగా పరుగుల సునామీ సృష్టించారు. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ)తో జరుగుతున్న కీలక పోరులో టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన సన్‌రైజర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 255 పరుగుల భారీ స్కోరు సాధించింది. తద్వారా ప్రత్యర్థి ఆర్‌సీబీ ముందు 256 పరుగుల కొండంత లక్ష్యాన్ని ఉంచింది. ఆర్‌సీబీపై సన్‌రైజర్స్‌కు ఇది రెండో అత్యధిక స్కోరు కావడం గమనార్హం. గతంలో 2024 సీజన్‌లో బెంగళూరుపై హైదరాబాద్ 287 పరుగులు చేసింది.

**హాఫ్ సెంచరీలతో చెలరేగిన టాపార్డర్:**

హైదరాబాద్ ఇన్నింగ్స్‌లో టాపార్డర్ బ్యాటర్లు ఆర్‌సీబీ బౌలర్లను చీల్చిచెండాడారు. ఓపెనర్ అభిషేక్ శర్మ కేవలం 22 బంతుల్లోనే 4 ఫోర్లు, 5 సిక్సర్లతో 56 పరుగులు చేసి జట్టుకు మెరుపు ఆరంభాన్నిచ్చాడు. ఆ తర్వాత ఇషాన్ కిషన్ (46 బంతుల్లో 8 ఫోర్లు, 3 సిక్సర్లతో 79), హెన్రిచ్ క్లాసెన్ (24 బంతుల్లో 2 ఫోర్లు, 5 సిక్సర్లతో 51) విధ్వంసకర హాఫ్ సెంచరీలతో స్టేడియాన్ని హోరెత్తించారు. ఆఖర్లో నితీష్ కుమార్ రెడ్డి (12 బంతుల్లో 29 నాటౌట్), ఓపెనర్ ట్రావిస్ హెడ్ (16 బంతుల్లో 26) వేగంగా ఆడటంతో హైదరాబాద్ భారీ స్కోరును నమోదు చేసింది. ఆరెంజ్ ఆర్మీ బ్యాటర్ల ధాటికి ఆర్‌సీబీ బౌలర్లు ధారాళంగా పరుగులిచ్చుకున్నారు. భువనేశ్వర్ కుమార్ (0/51), జోష్ హేజిల్ వుడ్ (0/55), రసిక్ సలామ్ (2/55) బౌలింగ్‌లో అర్ధసెంచరీల చొప్పున పరుగులు సమర్పించుకున్నారు. సుయాష్ శర్మ, కృనాల్ పాండ్యా చెరో వికెట్ పడగొట్టారు.



# డాక్టర్ చెన్నాడి అమిత్ కుమార్ జన్మదిన వేడుకలు

**వృద్ధులకు అరటిపండ్లు, సల్ల ప్యాకెట్ల పంపిణీ**

బలగం టీవీ, బోయినిపల్లి;

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం అనంతపల్లి గ్రామంలో డాక్టర్ చెన్నాడి అమిత్ కుమార్ పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని వృద్ధులకు అరటిపండ్లు మరియు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేసి, సేవా కార్యక్రమం చేపట్టారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల నాయకులు మల్లరపు చందు, బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు అల్వాల రాజయ్య బవండ్ల కమలాకర్, రాజయ్య, శ్రీనివాస్, గణేష్, అజయ్ తదితర యువకులు పాల్గొని జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.సామాజిక సేవా కార్యక్రమాలతో జన్మదిన వేడుకలు నిర్వహించడం అభినందనీయమని గ్రామస్థులు పేర్కొన్నారు. నాయకులు డాక్టర్ చెన్నాడి అమిత్ కుమార్ మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆకాంక్షించారు.

# పెగడపల్లి ఘటన దళిత సమాజ ఆత్మగౌరవంపై దాడి

**-మాదిగ హక్కుల దండోరా మండల ప్రధానకార్యదర్శి కూడెల్లి భరత్ కుమార్**

బలగం టీవీ, గంభీరావు పేట :



పెద్దపెల్లి జిల్లా కాల్వ శ్రీరాంపూర్ మండలం పెగడపల్లి గ్రామంలో ఎల్లమ్మ తల్లి బోనాల జాతర సందర్భంగా దళితులపై జరిగిన అమానవీయ ఘటనను మాదిగ హక్కుల దండోరా మండల ప్రధాన కార్యదర్శి కూడెల్లి భరత్ కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా భరత్ కుమార్ మాట్లాడుతూ

మొక్కు చెల్లించేందుకు బోనాలతో వెళ్లిన దళిత మహిళలను గుడిలోకి అనుమతించకుండా సుమారు ఆరు గంటల పాటు నిలబెట్టి కులం పేరుతో అవమానించడం దారుణమన్నారు.ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా దళిత సమాజాన్ని కలిచివేసిందని తెలిపారు.బాధితులు రోడ్డుపై బోనాలతో బైఠాయించి ఆందోళన చేపట్టడంతో పోలీసులు స్పందించి 20 మందిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయడం స్వాగతించదగ్గ విషయమని పేర్కొన్నారు. అయితే కేసులు నమోదు చేయడమే కాకుండా నిందితులను వెంటనే అరెస్ట్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే ఇలాంటి ఘటనలను మాదిగ హక్కుల దండోరా ఎట్టి పరిస్థితుల్లో సహించబోదని హెచ్చరించారు.రాష్ట్ర అధ్యక్షులు రేగుంట సునీల్ మాదిగ, రాష్ట్ర గౌరవ అధ్యక్షులు డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ ఆధ్వర్యంలో మాదిగ హక్కుల దండోరా బృందం గ్రామాన్ని సందర్శించి బాధిత కుటుంబాలకు ధైర్యం చెప్పడం జరిగిందన్నారు. రాజకీయ ఒత్తిళ్లకు లొంగకుండా ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# గెలిచినా టాప్ 3లోనే హైదరాబాద్

- ఆర్సీబీపై 55 పరుగుల తేడాతో సన్‌రైజర్స్ గెలుపు
- ఇషాన్ కిషన్, అభిషేక్ శర్మ, క్లాసెన్ అర్ధ సెంచరీలు
- ఈ నెల 27న ఎలిమినేటర్ మ్యాచ్ ఆడనున్న సన్‌రైజర్స్




బలగం టీవీ, హైదరాబాద్

ఐపీఎల్‌లో భారీ విజయంతో క్వాలిఫయర్-1కు అర్హత సాధించాలనే సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్) ఆశలపై రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) నీళ్లు చల్లింది. ఇషాన్ కిషన్, క్లాసెన్ బ్యాటింగ్‌తో ప్రత్యర్థి ముందు కొండంత లక్ష్యాన్ని ఉంచినప్పటికీ.. ఆర్‌సీబీని కట్టడి చేయడంలో హైదరాబాద్ బౌలర్లు విఫలమయ్యారు. మ్యాచ్‌లో గెలిచినప్పటికీ, నెట్ రన్‌రేట్ సమీకరణాల్లో ఆర్‌సీబీని 165 పరుగుల లోపే కట్టడి చేయాలనే లక్ష్యాన్ని అందుకోలేకపోవడంతో సన్‌రైజర్స్ మూడో స్థానానికే పరిమితం కావలసి వచ్చింది.

**మెరిసిన ఇషాన్, క్లాసెన్:**

ఉప్పల్ వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన హైదరాబాద్ టాపార్డర్ విధ్వంసం సృష్టించింది. ఓపెనర్ అభిషేక్ శర్మ (56) మెరుపు ఆరంభాన్ని ఇవ్వగా, ఆ తర్వాత ఇషాన్ కిషన్ (79), హెన్రిచ్ క్లాసెన్ (51) జోడీ ఆర్సీబీ బౌలర్ల భరతం పట్టింది. వీరిద్దరూ శతక భాగస్వామ్యంతో స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. డెత్ ఓవర్లలో నితీశ్ రెడ్డి (29 నాటౌట్) సిక్సర్లతో రెచ్చిపోవడంతో హైదరాబాద్ ప్రత్యర్థి ముందు 256 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది.

**కట్టడి చేయలేకపోయిన బౌలర్లు:**

క్వాలిఫయర్-1కు చేరాలంటే ఆర్‌సీబీని 165 పరుగుల లోపే ఆలౌట్ చేయాల్సిన స్థితిలో సన్‌రైజర్స్ బౌలర్లు ఆశించిన స్థాయిలో రాణించలేకపోయారు. 256 పరుగుల భారీ ఛేదనలో ఆర్‌సీబీ ఓపెనర్ వెంకటేశ్ అయ్యర్ (44) మెరుపు ఆరంభాన్నిచ్చాడు. శివాంగ్ వేసిన ఒకే ఓవర్లో మూడు సిక్సర్లు, ఒక ఫోర్‌తో ఏకంగా 23 పరుగులు రాబట్టాడు. ప్రమాదకరంగా మారిన అయ్యర్‌ను, ఆ తర్వాత విరాట్ కోహ్లీ (15)ని మలింగ, షకీబ్ వికెట్లు తీసి దెబ్బకొట్టినప్పటికీ.. అప్పటికే పవర్‌ప్లేలో ఆర్‌సీబీ 2 వికెట్లకు 75 పరుగులు చేసింది.

ఆ తర్వాత రజత్ పటిదార్ (56), కృనాల్ పాండ్యా (41 నాటౌట్) జోడీ సన్‌రైజర్స్ క్వాలిఫయర్ ఆశలను దెబ్బతీయడమే లక్ష్యంగా ఆచితూచి ఆడింది. వికెట్ పడకుండా స్ట్రైక్ రొటేట్ చేస్తూ స్కోరును బోర్డును ముందుకు నడిపారు. చివరకు హైదరాబాద్ 55 పరుగుల తేడాతో జయభేరి మోగించినప్పటికీ.. రన్‌రేట్ సమీకరణాల దృష్ట్యా క్వాలిఫయర్-1 బెర్త్‌ను మాత్రం చేజార్చుకుంది.

# బీహార్‌కు ఓ జట్టు ఉండాల్సిందే

**వేదాంత ఛైర్మన్ అనిల్ అగర్వాల్**

బలగం టీవీ, పాట్నా



ఐపీఎల్‌లో వైభవ్ సూర్యవంశీ రికార్డుల మీద రికార్డులు సృష్టిస్తున్నాడు. బిహార్‌కు చెందిన ఈ 15 ఏళ్ల కుర్రాడు సంచలన ఆటతో ఆకట్టుకుంటున్నాడు. ఇలాంటి ఆటగాడు వచ్చిన బిహార్‌కూ ఓ ఐపీఎల్ జట్టు ఉండాలని బిలియనీర్ అనిల్ అగర్వాల్ వెల్లడించారు. భారత్‌లోనే అతిపెద్ద కార్పొరేట్ సంస్థల్లో ఒకటైన వేదాంతా గ్రూప్‌నకు ఆయన ఛైర్మన్. పట్నాలో 1954లో ఆయన జన్మించారు. సోషల్ మీడియా వేదికగా ఓ పోస్టు వైరల్‌గా మారింది. బిహార్ నుంచి అద్భుతమైన క్రికెటర్లు వస్తున్నారని అందులో పేర్కొన్నారు. 'ముంబయి ఇండియన్స్, చెన్నై సూపర్ కింగ్స్, కోల్‌కతా నైట్‌రైడర్స్ మాదిరిగా బిహార్ కూడా అద్భుతమైన జట్టును కలిగి ఉండటానికి అర్హత ఉందని మీకు అనిపించడం లేదా? బిహార్ గడ్డ ఎంతో మంది నాణ్యమైన క్రికెటర్లను దేశానికి అందించింది. పట్నాలో జన్మించిన ఇషాన్ కిషన్ వన్డేల్లో అత్యంత వేగవంతమైన డబుల్ సెంచరీ సాధించాడు. సమస్తిపుర్ నుంచి వచ్చిన వైభవ్ సూర్యవంశీ ఐపీఎల్ అరంగేట్రంలోనే రికార్డులు సృష్టించాడు. సకిబ్ హుస్సేన్ (ఎస్ఆర్‌హెచ్) గోపాల్‌గంజ్‌లోని ఓ సాధారణ కుటుంబానికి చెందిన ప్లేయర్. ఇలాంటివన్నీ చూసినప్పుడు నాకు ఒకటే అనిపించేది. ఎందుకు క్రికెట్‌లో బిహార్‌కు గుర్తింపు రావడం లేదు? బిహార్ యువత ప్రతి రంగంలోనూ రాణించేలా అవకాశాలు కల్పించడం. మన క్రీడాకారులకు ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, ప్రోత్సాహం అందించేలా చేయడం నా చిరకాల స్వప్నం. బిహార్ నుంచి వచ్చే జట్టు ప్రపంచంలోనే అత్యుత్తమ జట్టుగా నిలుస్తుందన్న పూర్తి విశ్వాసం నాకుంది' అని అనిల్ అగర్వాల్ పోస్టు పెట్టారు. నాలుగేళ్ల కిందట రెండు ఫ్రాంచైజీలు అదనంగా వచ్చిన సంగతి తెలిసిందే. లఖ్‌నవూ సూపర్ జెయింట్స్, గుజరాత్ టైటాన్స్ అడుగు పెట్టాయి. ఇప్పటికే ఐపీఎల్ మార్కెట్ విలువ భారీగా ఉంది. దీంతో కొత్త ఫ్రాంచైజీలకు అవకాశం ఇవ్వాలనే డిమాండ్లూ వస్తున్నాయి. తెలుగు రాష్ట్రాల నుంచి ఒకటి, నార్త్ ఈస్ట్ రాష్ట్రాల నుంచి ఒక ఫ్రాంచైజీకి అనుమతి ఇవ్వాలని పలువురు కోరారు. ఇప్పుడు బిహార్‌కు చెందిన బిలియనీర్ నేరుగా రంగంలోకి దిగడంతో ఐపీఎల్ మేనేజ్‌మెంట్ ఏం చేస్తుందనేది ఆసక్తికరంగా మారింది.

# చెన్నై కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్‌కు రూ. 24 లక్షల ఫైన్




బలగం టీవీ, హైదరాబాద్

ఐదుసార్లు ఐపీఎల్ ఛాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్‌కు ఊహించని షాక్ తగిలింది. గురువారం గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన కీలక పోరులో 89 పరుగుల తేడాతో ఘోర పరాజయాన్ని చవిచూడటమే కాకుండా, స్లో ఓవర్ రేట్ కారణంగా జట్టుపై భారీ జరిమానా వేటు పడింది. ఐపీఎల్ ప్రవర్తనా నియమావళి ప్రకారం ఇది చెన్నై జట్టుకు రెండో అఫెన్స్ (తప్పు) కావడంతో.. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్‌కు రూ. 24 లక్షల జరిమానా విధించినట్లు ఐపీఎల్ ఒక ప్రకటనలో తెలిపింది. అంతేకాకుండా జట్టులోని మిగతా సభ్యులతో పాటు ఇంపాక్ట్ ప్లేయర్‌కు రూ. 6 లక్షలు లేదా వారి మ్యాచ్ ఫీజులో 25 శాతం కోత విధించారు.

గుజరాత్ టైటాన్స్ ఇచ్చిన ఆఖరి పంచ్‌తో ఐపీఎల్ 2026 సీజన్‌లో చెన్నై లీగ్ దశలోనే ఇంటిదారి పట్టింది. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో ఘోరంగా విఫలమైన సీఎస్కే సాంకేతికంగా ఉన్న ప్లేఆఫ్స్ ఆశలను పూర్తిగా చేజార్చుకుంది. మరోవైపు వరుసగా ఐదు విజయాల తర్వాత గత మ్యాచ్‌లో కోల్‌కతా చేతిలో ఓడిన టైటాన్స్.. చెన్నైపై ఈ భారీ విజయంతో పాయింట్ల పట్టికలో రెండో స్థానాన్ని మరింత పదిలం చేసుకుంది.

టాస్ గెలిచి మొదట బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ టైటాన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 229 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఓపెనర్ సాయి సుదర్శన్ (53 బంతుల్లో 7 ఫోర్లు, 4 సిక్సర్లతో 84), కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (37 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్సర్లతో 64) లతో పాటు జోస్ బట్లర్ (27 బంతుల్లో 5 ఫోర్లు, 4 సిక్సర్లతో 57 నాటౌట్) అర్ధసెంచరీలతో చెన్నై బౌలర్లపై విరుచుకుపడ్డారు.

అనంతరం 230 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన చెన్నై సూపర్ కింగ్స్.. గుజరాత్ బౌలర్ల ధాటికి 13.4 ఓవర్లలోనే కేవలం 140 పరుగులకే కుప్పకూలింది. మహ్మద్ సిరాజ్ (3/26), కాగిసో రబాడ (3/32), రషీద్ ఖాన్ (3/18) ముప్పేట దాడితో చెన్నై బ్యాటింగ్ ఆర్డర్ తలవంచింది. చెన్నై బ్యాటర్లలో శివం దూబే (17 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్సర్లతో 47) మినహా మిగతా వారెవరూ కనీస పోరాటాన్ని కనబరచలేకపోయారు. అద్భుత బౌలింగ్ ప్రదర్శన చేసిన మహ్మద్ సిరాజ్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు లభించింది.

# రంగారెడ్డి జిల్లా ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టు రికార్డు తీర్పులు..

**రెండేళ్లలో 150 మంది నిందితులకు శిక్ష!**

**రంగారెడ్డి జిల్లా ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టు సంచలనం**

**బాధితులకు రూ.3 కోట్లకు పైగా నష్టపరిహారం మంజూరు**

**10 కేసుల్లో మరణాంతర శిక్ష, 15 కేసుల్లో యావజ్జీవం**

బలగం టీవీ, హైదరాబాద్

చిన్నారులపై జరుగుతున్న లైంగిక వేధింపుల కేసుల విచారణలో రంగారెడ్డి జిల్లా ప్రత్యేక పోక్సో ఫాస్ట్‌ట్రాక్ కోర్టు సరికొత్త రికార్డు సృష్టించింది. పోక్సో చట్టం-2012 కింద నమోదైన కేసులను అత్యంత వేగంగా విచారించిన న్యాయస్థానం.. కేవలం రెండేళ్ల వ్యవధిలోనే ఏకంగా 150 కేసుల్లో నిందితులకు కఠిన శిక్షలు ఖరారు చేస్తూ సంచలన తీర్పులు వెలువరించింది. బాధితులకు త్వరితగతిన న్యాయం అందించడమే ధ్యేయంగా ఈ కోర్టు ప్రత్యేక చొరవ చూపింది.

**బాధితులకు అండగా రూ.3 కోట్ల పరిహారం:**

లైంగిక దాడులకు గురైన చిన్నారుల పునరావాసం, వారి భవిష్యత్తు కోసం న్యాయస్థానం పెద్దపీట వేసింది. విచారణ పూర్తయిన అన్ని కేసుల్లో కలిపి బాధితులకు దాదాపు రూ.3 కోట్లకు పైగా నష్టపరిహారాన్ని మంజూరు చేసింది. ఈ పరిహారం సొమ్ము వీలైనంత త్వరగా బాధితులకు అందేలా చూడాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (ఖూూూ)కు ఎప్పటికప్పుడు కీలక ఆదేశాలు జారీ చేస్తూ బాధితులకు అండగా నిలిచింది.

గత రెండేళ్ల కాలంలో ఈ ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టు వెలువరించిన తీర్పుల వివరాలను పరిశీలిస్తే నిందితులకు చట్టం ఎంత కఠినంగా శిక్షలు అమలు చేసిందో స్పష్టమవుతోంది.

తుదిశ్వాస వరకు జైలు: అత్యంత అమానుషంగా ప్రవర్తించిన 10 కేసుల్లో నిందితులకు వారు బతికున్నంత కాలం (తుదిశ్వాస విడిచే వరకు) జైల్లోనే ఉండేలా శిక్ష విధించింది.

యావజ్జీవ కారాగారం: మరో 15 కేసుల్లో నిందితులకు కోర్టు యావజ్జీవ శిక్షలను ఖరారు చేసింది.

సుదీర్ఘ జైలు శిక్షలు: 35 కేసుల్లో నిందితులకు ఇరవై ఏళ్ల కఠిన కారాగార శిక్ష, 17 కేసుల్లో 14 ఏళ్ల జైలు శిక్ష విధించింది.

వీటితో పాటు మిగిలిన కేసుల తీవ్రతను బట్టి ఏడేళ్లు, ఐదేళ్లు, మూడేళ్లు, రెండేళ్లు మరియు ఏడాది చొప్పున జైలు శిక్షలతో పాటు భారీగా జరిమానాలు కూడా విధించింది.

కేసుల దర్యాప్తు, విచారణలో వేగం పెంచితే బాధితులకు సకాలంలో న్యాయం జరుగుతుందని రంగారెడ్డి జిల్లా ప్రత్యేక పోక్సో కోర్టు నిరూపించింది.

# ఎండల తీవ్రతపై కూటమి ప్రభుత్వం అప్రమత్తం..


**కలెక్టరేట్లకు సీఎం కీలక ఆదేశాలు!**

**రాష్ట్రవ్యాప్తంగా చలివేంద్రాలు, మజ్జిగ పంపిణీకి శ్రీకారం**

**అవసరమైతే స్థానికంగా సెలవులు ప్రకటించండి: చంద్రబాబు**

**తాగునీటి సరఫరాకు ఆటంకం కలిగితే సహించేది లేదు**

బలగం టీవీ, అమరావతి



రాష్ట్రంలో రోజురోజుకు భానుడి భగభగలు, వడగాల్పుల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అప్రమత్తమైంది. ఎండల తీవ్రత, చేపట్టాల్సిన సన్నద్ధత చర్యలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అమరావతిలో శనివారం ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో తీవ్రమవుతున్న హీట్‌వేవ్ పరిస్థితులను ఎదుర్కొనేందుకు వీలుగా తక్షణ ఉపశమన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

**ప్రజల కోసం చలివేంద్రాలు.. ఓఆర్ఎస్ సరఫరా:**

ఎండ దెబ్బ నుంచి ప్రజలను కాపాడేందుకు రాష్ట్రవ్యాప్తంగా ప్రధాన కూడళ్లు, రద్దీ ప్రాంతాల్లో టెంట్లు, చలివేంద్రాలను తక్షణమే ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈ కేంద్రాల ద్వారా ప్రజలకు నిరంతరం చల్లని తాగునీరు, మజ్జిగతో పాటు విపత్తు నిర్వహణ శాఖ సహకారంతో ఓఆర్ఎస్ (ఉక్కూ) ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని సూచించారు. ఎండల తీవ్రత విపరీతంగా ఉన్న ప్రాంతాల్లో పరిస్థితులను అంచనా వేసి, అవసరమైతే స్థానికంగా సెలవులు ప్రకటించే అంశాన్ని పరిశీలించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.


**తాగునీటి ఎద్దడి రాకూడదు:**

వేసవి నేపథ్యంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఎక్కడా తాగునీటి సరఫరాకు అంతరాయం కలగకుండా చూడాల్సిన పూర్తి బాధ్యత అధికారులపైనే ఉందని ముఖ్యమంత్రి హెచ్చరించారు. ఎండల తీవ్రత దృష్ట్యా ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విస్తృతంగా అవగాహన కల్పించాలని, ఇందుకోసం జిల్లా కలెక్టర్లు ప్రత్యేకంగా మీడియా సమావేశాలు నిర్వహించి ప్రజలను చైతన్యపరచాలని నిర్దేశించారు.

**సమీక్షలో పాల్గొన్న ఉన్నతాధికారులు:**

ముఖ్యమంత్రి నిర్వహించిన ఈ అత్యున్నత సమీక్షా సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (జూ) సాయి ప్రసాద్‌తో పాటు విపత్తు నిర్వహణ సంస్థ, వైద్యారోగ్య, పురపాలక, పంచాయితీరాజ్ శాఖల ప్రిన్సిపల్ సెక్రటరీలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. క్షేత్రస్థాయిలో యంత్రాంగం అంతా సమన్వయంతో పనిచేసి ప్రాణనష్టం జరగకుండా చూడాలని సీఎం ఆదేశించారు.

# చిరుకు కూతురుగా అనస్వర



చిత్రపరిశ్రమలో ఎప్పుడు ఎవరిని అదృష్టం వరిస్తుందో చెప్పడం చాలా కష్టం. కొంతమందికివరుస విజయాలు అందుకున్నా కొన్నిసార్లు ఛాన్స్ లు రావు. మరికొంతమందికి ఒక్క సినిమా చేసినా మెగా ఛాన్స్ వచ్చేస్తోంది. తాజాగా మలయాళ బ్యూటీ అనస్వర రాజన్ రెండో కేటగిరిలో ఉందని చెప్పొచ్చు. చిన్న చిన్న పాత్రలు చేస్తూ కెరీర్ ను ప్రారంభించిన ఈ బ్యూటీ ప్రస్తుతం స్టార్ హీరోయిన్ గా కొనసాగుతోంది.ఛాంపియన్ సినిమాతో అనస్వర తెలుగు ఇండస్ట్రీకి పరిచయమైంది. రోషన్ హీరోగా ప్రదీప్ అద్వైతం దర్శకత్వం వహించిన ఈ సినిమా గతేడాది రిలీజ్ అయ్యి మిక్స్డ్ టాక్ ను అందుకుంది. సినిమా ఆశించిన ఫలితాన్ని అందుకోలేకపోయినా అనస్వర న్యాచురల్ యాక్టింగ్ కి తెలుగు ప్రేక్షకులు ఫిదా అయ్యారు. అమ్మడికి టాలీవుడ్ లో మంచి భవిష్యత్ ఉంటుందని జోస్యం కూడా చెప్పారు. ఇప్పుడు ఆ జోస్యం నిజమైంది. ఈ చిన్నది తన రెండో సినిమానే మెగాస్టార్ చిరంజీవితో చేస్తోంది. మెగాస్టార్ చిరంజీవి– బాబీ కొల్లి కాంబోలో వస్తోన్న చిత్రం మెగా 158. కెవిఎన్ ప్రొడక్షన్స్ నిర్మిస్తోన్న ఈ చిత్రం తాజాగా పూజా కార్యక్రమాలను పూర్తిచేసుకుంది. ఈ ప్రారంభోత్సవంలో పవన్ కళ్యాణ్ ముఖ్యఅతిథిగా పాల్గొనడం విశేషం. చిరంజీవిపై చిత్రీకరించిన ప్రారంభ సన్నివేశానికి పవన్ కళ్యాణ్ క్లాప్ కొట్టారు. ఇక ఈ చిత్రంలో అనస్వర ఒక కీలక పాత్రలో నటించబోతోంది. చిరుకు కూతురిగా ఆమె నటిస్తోందని తెలుస్తోంది. మెగాస్టార్ సినిమాలో ఒక చిన్న పాత్ర చేసినా అది ఈ తరం నటీనటులకు అచీవ్ మెంట్ అని చెప్పొచ్చు. ఎన్నోఏళ్లుగా ఇండస్ట్రీలో ఉన్న హీరోయిన్లకు రాని మెగా ఛాన్స్ రెండో సినిమాకే ఈ మలయాళ బ్యూటీకి దక్కడం నిజంగా ఆమె అదృష్టమని నెటిజన్స్ అంటున్నారు. ఏది ఏమైనా అనస్వర నక్కతోక తొక్కింది అని ఫ్యాన్స్ కామెంట్స్ చేస్తున్నారు.

# ఉప్పెనను మించిన ట్విస్ట్ ఉంటుంది



రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో రానున్న చిత్రం 'పెద్ది'. జూన్ 4న ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రచారంలో భాగంగా బుచ్చిబాబు, రామ్ చరణ్ కార్ డ్రైవ్ చేస్తూ ఇంటర్వ్యూ నిర్వహించారు. 'మీకు ఇష్టమైన ఎపిసోడ్ ఏది?' అని దర్శకుడు అడగ్గా.. 'ఢిల్లీ ఎపిసోడ్ చాలా బాగుంటుంది. సినిమాలో నాకు ఇష్టమైన పార్ట్ అది. 'పెద్ది' మొత్తంలో ఎక్కువ మలుపులు ఉండేది ఆ ఎపిసోడ్‌లోనే కదా.. ఉప్పెనలో ట్విస్ట్ కంటే 100రెట్లు ఎక్కువ ఉంటుంది ఆ ఎపిసోడ్ అని చెప్పారు

# మెగాస్టార్ చిరంజీవి హీరోగా 158వ చిత్రం

క్లాప్ కొట్టిన తమ్ముడు పవన్ కళ్యాణ్ మెగాస్టార్ చిరంజీవి హీరోగా 158వ చిత్రం గురువారం మొదలైంది. కె.ఎస్.రవీంద్ర (బాబీ కొల్లి) దర్శకత్వంలో కె.వి.ఎన్ ప్రొడక్షన్స్ పతాకంపై కె.నారాయణ నిర్మిస్తున్నారు. అన్నపూర్ణ స్టూడియోలో పూజా కార్యక్రమాలతో ఈ చిత్రం ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ క్లాప్ కొట్టారు. చిరంజీవి కుమార్తె సుస్మిత కెమెరా స్విచ్ఛాన్ చేశారు. దర్శకుడు వి.వి. వినాయక్ గౌరవ దర్శకత్వం వహించారు. అయితే ఈ సినిమా ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆసక్తికర విషయాలు చోటు చేసుకున్నాయి. అన్నపూర్ణ స్టూడియోకు చిరంజీవి, తన సోదరుడు పవన్‌కల్యాణ్ ఒకే కారులో వచ్చారు. తదుపరి నాగబాబు జాయిన్ అయ్యారు. ముగ్గురు కలిసి ఒకే సోఫాలో కూర్చుని చక్కగా ముచ్చటించుకున్నారు. చిరంజీవి పక్కన ఉన్నంత సేపు పవన్ ఎంతో వినయంగా ఉన్నారు. ఈ దృశ్యాన్ని చూసి







అభిమానులు సంబరపడిపోయారు. చాలాకాలం తర్వాత ముగ్గురు సోదరులను ఒకే వేదికపై చూడటం కనుల విందుగా ఉందంటూ కామెంట్స్ చేస్తున్నారు. అలాగే చిరంజీవి, పవన్ కల్యాణ్, రామ్‌చరణ్ ఫొటోలను చిత్రించిన పట్టు శాలువాతో చిరంజీవిని సన్మానించింది చిత్ర బృందం. మరో ఆసక్తికర విషయం ఏంటంటే.. పవన్‌కల్యాణ్‌కి భక్తుడైన బండ్ల గణేశ్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. బండ్లను చూడగానే పవన్ దగ్గరకు తీసుకుని భుజంపై చేయి వేసి మాట్లాడుతూ లోపలికి తీసుకెళ్లారు. ఆ కాసేపు బండ్ల మొహం హై వోల్టేజ్ బల్బ్‌లా వెలిగిపోయింది. ఎప్పటిలాగే వినయంగా చేతులు కట్టుకుని మాట్లాడారు బండ్ల గణేశ్. చిరంజీవి సైతం బండ్లను హత్తుకున్నారు. అభిమానులు మాత్రం 'బండ్లన్నకు ఇవాళ పండగే.. ఆయన అభిమానించే హీరోలతో సరదాగా కాసేపు ముచ్చటించారు. ఈ రోజు ఆయనకు నిద్ర పట్టదేమో' అంటూ కామెంట్లు చేస్తున్నారు. ఈ కార్యక్రమానికి అనశ్వర రాజన్ కూడా హాజరయ్యారు. ఈ చిత్రంలో ఆమె చిరుకు కుమార్తెగా కనిపించనున్నట్లు టాక్ నడుస్తోంది.

# డ్రాగన్‌కు 64 మిలియన్ల వ్యూస్




పొరపాటున కూడా నా కలలోకి రావొద్దు' అంటూ రికార్డును తన ఖాతాలో వేసుకున్నారు అగ్ర కథానాయకుడు ఎన్టీఆర్. ఆయన ప్రధాన పాత్రలో ప్రశాంత్ నీల్ తెరకెక్కిస్తున్న చిత్రం 'డ్రాగన్' తారక్ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమా నుంచి మొదటి అప్‌డేట్‌గా గ్లింప్స్‌ను విడుదల చేశారు. 4 నిమిషాలు ఉన్న ఈ వీడియో సోషల్ మీడియాను షేక్ చేసింది. ఇప్పుడు రికార్డును కూడా నమోదు చేసింది. 24 గంటల్లో 'డ్రాగన్' గ్లింప్స్ 64 మిలియన్లకు పైగా వ్యూస్‌ను సొంతం చేసుకున్నట్లు టీమ్ తెలిపింది. ఇప్పటివరకూ ఇండియాలో ఏ సినిమా గ్లింప్స్‌నకు ఇన్ని వ్యూస్ రాలేదని వెల్లడించింది. ఇది ఆల్‌టైం రికార్డు అంటూ పోస్టర్ విడుదల చేసింది. ఇది కేవలం ఆరంభం మాత్రమేనని భవిష్యత్తులో మరిన్ని రికార్డులు రావడం ఖాయమంటూ ఫ్యాన్స్ భావిస్తున్నారు. తాజాగా విడుదల చేసిన గ్లింప్స్‌లో ఎన్టీఆర్ 'డ్రాగన్'గా రక్తపాతం సృష్టించే శక్తిమంతమైన పాత్రలో కనిపించారు. విజువల్స్ ప్రత్యేకమైన కథా ప్రపంచాన్ని ఆవిష్కరించాయి. 'కె.జి.ఎఫ్' చిత్రాలతో పాన్ ఇండియా స్థాయిలో ప్రేక్షకుల్ని అలరించిన దర్శకుడు ప్రశాంత్‌నీల్ 'సలార్' తర్వాత తెరకెక్కిస్తున్న సినిమా ఇది. ప్రేక్షకుల్లో భారీ అంచనాలున్న ఈ చిత్రం వచ్చే ఏడాది జూన్ 11న ప్రేక్షకుల ముందుకురానుంది.



# బాబీ డియోల్ బందర్ మూవీ

బాలీవుడ్ స్టార్ నటుడు బాబీ డియోల్ ప్రధాన పాత్రలో నటిస్తున్న యాక్షన్ క్రైమ్ థ్రిల్లర్ బందర్ . 'యానిమల్' సినిమాతో గ్లోబల్ స్థాయిలో తన పవర్‌ఫుల్ నటనతో ఆకట్టుకున్న బాబీ డియోల్, మరోసారి అంతకు మించిన ఇంటెన్స్ రోల్‌లో ఈ చిత్రం ద్వారా ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. తాజాగా ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. ట్రైలర్ చూస్తుంటే.. బాబీ డియోల్ ఈ సినిమాలో ఓ రాక్ స్టార్‌గా, విలాసవంతమైన జీవితాన్ని గడిపే 'ప్లేబాయ్' పాత్రలో కనిపిస్తున్నాడని తెలుస్తుంది. అయితే, అంతా సాఫీగా సాగిపోతున్న సమయంలో అతను అనుకోకుండా జైలు పాలు కావాల్సి వస్తుంది. అసలు బాబీ జైలుకు ఎందుకు వెళ్ళాడు? అతనిపై కేసు పెట్టిన ఆ యువతి ఎవరు? అనే ఆసక్తికర అంశాలు తెలియాలంటే సినిమా చూడాల్సిందే. ఇక ఈ చిత్రంలో బాబీ డియోల్‌తో పాటు సన్యా మల్హోత్రా, సబా ఆజాద్ మరియు సప్నా పబ్బి కీలక పాత్రల్లో మెరుస్తున్నారు. ఈ సినిమాకు అనురాగ్ కశ్యప్ దర్శకత్వం వహిస్తుండగా.. నిఖిల్ ద్వివేది మరియు అనురాగ్ కశ్యప్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. అన్ని హంగులతో, హై వోల్టేజ్




డ్రామాతో రూపొందుతున్న ఈ చిత్రం 2026, జూన్ 5న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో సందడి చేయనుంది. బాబీ డియోల్ కొత్త మేకోవర్ చూస్తుంటే ఈ సినిమా ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని పంచడం ఖాయంగా కనిపిస్తోంది.